ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 14, 2018



NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell : 9849070838

ఆటపాటల దసరా



టాలీవుడ్, బాలీవుడ్ ఇలా ఏ చిత్ర సీమలో అయినా నిన్నమొన్నటి దాకా పాటలు, సన్నివేశాల చిత్రీకరణంటే విదేశీ సెట్స్‌లో వాలిపోయేవారు. కానీ, ఇప్పుడు అలా కాదు. స్థానిక కథలతోపాటు స్థానిక ప్రదేశాలకీ మన సినిమాల్లో చోటుదక్కుతోంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహతక్ పాస్, జమ్మూ పాంగోంగ్ సరస్సు పరిసర ప్రాంతాలు, గుల్మార్గ్, రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ కోట, బెనారస్ ఘాట్, ఇండియా గేట్, డార్జిలింగ్, షిల్లాంగ్, మున్నార్, ఊటీ, పంబన్ బ్రిడ్జి, గోవాలోని కోట, మహారాష్ట్రలోని ధోమ్ డ్యామ్, మహాబళేశ్వర్ ఇలా ఎన్నో ప్రాంతాలు బాలీవుడ్ చిత్రాలకు షూటింగ్ స్పాట్స్‌గా మారుతున్నాయి. ఇటీవల విడుదలైన 'సూయీ ధాగా', 'భట్టీ గుల్ చాలూ', 'స్త్రీ' వంటి చిత్రాలు వారణాసీ, లక్నో, బరేలీ ప్రాంతాల ప్రాంతీయ కథలతోపాటు ప్రాంతీయ ఫ్లేవర్లనీ ప్రతిబింబిస్తున్నాయి. ఇక టాలీవుడ్‌లోనూ ఊళ్లు, ప్రాంతాలు అక్కడ జరిగిన సంఘటనల పేర్లతో చిత్రాలు రావడం ఎక్కువైంది. 'రంగస్థలం', 'కేరాఫ్ కంచరపాలెం', 'ఆర్‌ఎక్స్ 100' వంటి చిత్రాలు ఆ కోవలోవే. ఇవేకాదు, మిగతా చిత్రాల్లోనూ లోకల్ ఫ్లేవర్ పెరుగుతోంది. అది సన్నివేశాల్లో కనిపించే దృశ్యాల్లోనైనా...! 'గీత గోవిందం', 'దేవదాస్', 'శైలజారెడ్డి అల్లుడు' 'పేపర్‌బాయ్' వంటి చిత్రాల్లో తెలుగుదనమున్న చిత్రీకరణ ఎక్కువగా కనిపిస్తుంది. బాలీవుడ్‌లోనూ, టాలీవుడ్‌లోనూ చిన్న సినిమాల సంఖ్య పెరగడం... వాటి కథానేపథ్యంలో ప్రాంతీయత ఎక్కువగా ఉండటంతో కీలక సన్నివేశాలకు దేశంలోని పల్లెటూళ్లు, పాత ప్రాంతాల ప్రాధాన్యత పెరుగుతోంది. ఇది మంచి పరిణామమే. ఎంతసేపూ విదేశీ రోడ్లు, ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాల్లో సాగే పాటలు, సన్నివేశాలు ప్రేక్షకుడికి విసుగు తెప్పించేలోగా ఇలా స్పాట్ మారడం హర్షించదగ్గదే.



మళ్లీ లోకల్

ఆటపాటల దసరా

అట్టమీది కథ..... 6

మొసలి కన్నీరు..

అనే మాటను వినే ఉంటారు. అది వేరే అర్థంలో వాడతాం. కానీ, ఈ మొసలి కన్నీటిని సీతాకోక చిలుకలు తాగుతాయన్న సంగతి మీరెప్పుడైనా విన్నారా..! ఇది నిజం. ఎందుకంటే... కన్నీటిలోని సోడియం కోసం సీతాకోకచిలుకలు ఇలా చేస్తాయట. ఈ మధ్య వైరల్ అయిన ఓ వీడియోలో ఓ రెక్కల పురుగు.. నిద్రిస్తోన్న ఓ పక్షి కన్నీటిని ఇలానే తాగుతున్న దృశ్యం క్యాప్చర్ అవడంతో ఈ టాపిక్ మళ్లీ చర్చల్లోకి వచ్చింది. బ్రెజిల్‌లోని అమెజాన్ అటవీ ప్రాంతంలోనిదీ ఫుటేజ్. కళ్లెంట కారే కన్నీటినైతే పర్లేదనుకుంటే పొరపాటే. కనుగుడ్డు మీద తమ నాలికను చాపి నీటిని జుర్రుకుంటాయి. మొసలి, పక్షుల కంటికి ఏమాత్రం హానీ కలగక పోవడంతో అవీ ఏమనవు. కేవలం ఇవే కాదు, తాబేళ్ల కన్నీటిని ఇలాగే లాగేస్తాయి రెక్కల పురుగులు. లాక్రీఫేగస్‌గా పిలిచే ఇలాంటి ఎన్నో విషయాలు అడవిలో ఇంకా రహస్యంగా ఉండిపోతున్నాయి.

అరవిరిసిన అంగళ్లు

విశేషం..... 12

ప్రత్యేకం - 4
లెక్కల మ్యూజియం

సన్నివేశమ్ - 2
వీధి నీడలు

వినూత్నం- 5
ఓ పచ్చని ఆలోచన

తెలుసా -11
క్యారెట్ మ్యూజియం

కథ -14
కొత్తరాజధాని

పిల్లల సీరియల్ -18
దారి తప్పిన పిల్లవాడు

బాలనేస్తాలు - 17
మారిన సింహం

సుచిత్రం -24
ధైర్యాన్ని పోనీకమ్మా..!

గతవారం ప్రచురించిన 'చిన్నారి కావాలి నేర్పరి' అట్టమీది కథ ఆకట్టుకుంది. ఇది పెద్దవాళ్ళు తప్పక చదవాల్సిన రచన. 'మరోతరం' కథ బాగుంది. పిల్లల సీరియల్ ప్రారంభించి కొనసాగిస్తున్నందుకు అభినందనలు. కవితలన్నీ భావగర్భితంగా ఉన్నాయి. 'ఈ నదో ప్రయోగశాల' కొంగొత్త అంశాలను స్పృశించింది. ఊకతో ఇంటి నిర్మాణం చేపట్టిన బిస్మన్ డ్యూకు హ్యాట్సాఫ్.

- నేమాన శుభాష్ చంద్రబోస్,
విశాఖపట్నం.

స్నేహ సంచికలో ప్రచురిస్తున్న అన్ని కథనాలూ బాగుంటున్నాయి. ప్రత్యేకించి మన తెలుగమ్మాయి పవర్ లిఫ్టింగ్‌లో రాణించిన కథనం ఆకట్టుకుంది. కవితలు, బాలల సీరియల్, చివరి అట్టపై వచ్చే చిత్రాలు చాలా బాగున్నాయి. నవ్వుల్...పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

- నైదా ఈశ్వరరావు,
విశాఖపట్నం.

నిన్ను నువ్వే
వెతికే.. కొలంబస్ నువ్వా..
నీతో నువ్వు పాడే కోరస్ నువ్వా..
నిన్ను నువ్వే మోసే హెర్క్యులెస్ నువ్వా..
నీతో నువ్వు ఆడే చెస్సే నువ్వా
ఆటవా.. పాటవా... వేటవా.. వేటగాడివా...

నిప్పు పుట్టక ముందే.. నీలో గుండెమంట ఉందే
నీరు పుట్టక ముందే నీలో కన్నీరుందే
గాలీ వీచకముందే.. శ్వాసలోన తుపానుందే
నింగి నేలా ఉనికి నీ ముందేమో ప్రశ్నయిందే...
నిప్పువా.. నీరువా... గాలివా.. ప్రశ్నవా...

రచన : చంద్రబోస్
గీతం : హు ఆర్ యు...
చిత్రం : వన్ - నేనొక్కడినే

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా : స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం : 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

సన్నివేశమ్

వీధి నీడలు

- అజై
95023 95077

వీధి మలుపులోకి తిరిగాడు కుర్రాడు. రోడ్డుకు అడ్డంగా బార్లా పడుకున్న కుక్కల గుంపు కనిపించింది. రోజు వెళ్లే దారి. రోజు ఎదురయ్యే వీధికుక్కలే. ఏమాత్రం జంకు లేకుండా నడుస్తున్నాడు. వాడి బూట్ల శబ్దం వాటికి అలవాటేమో.. వాడి శరీరం వాసనా అప్పుడే పసిగట్టేశాయేమో అందులో ఓ కుక్క లేచి పక్కకు నడిచి దారిచ్చింది. వీధి నడి మధ్యకు వెళ్లాక గానీ గుర్తురాలేదు. అక్కడకి పదడుగుల దూరంలో కుడి పక్కగా నడవకూడదని. అక్కడా ఓ కుక్క ఉంటుంది.. పైగా చైనుకి కట్టేసి. నీడే కరిచినంత జడుసుకుని ఒక్క గెంతులో పక్కకు దూకాడు. అక్కడ కుక్క కనిపించలేదు. చైను విదిలించుకుందా అని గుండె జల్లుమంది. అక్కడే నిలబడిపోయి చుట్టుతా చూశాడు. ఎక్కడా దాని జాడ లేదు. వెనుకేదో చైను నేలకు ఆనుతూ వస్తోన్న అలికిడి. బెదురుగా వెనక్కు చూశాడు. ఎవరో పిల్లాడు చైన్ తెగిన సైకిల్‌ని ఈడ్చుకుంటూ వస్తున్నాడు. కుర్రాడికి విషయం అర్థమైంది. ఆ కుక్కను ఇంట్లోకి తీసుకెళ్లిపోయింటారని. మరి సమయం రాత్రి పది దాటింది. ఆ వీధెంట కుడి పక్కకు, ఎడమ పక్కకు తేడా తెలీకుండా తుళ్లుతూ తూలుతూ నడిచేవాళ్ల టైమది. తాగుబోతులంటే... ఆ కుక్కకీ పరమచికాకు. అంతదూరం నుంచే గోలపెడుతుంది. ఎంత బిర్రుగా కిటికీలు, తలుపులు మూసుకున్నా నిద్రంటనివ్వదు. ఈ గోల ఈమధ్య మరీ ఎక్కువై పోవడంతో అటు తాగుబోతు మొగుడిని ఇటు వదరబోతు కుక్కనూ తిట్టుకుంటూ తల్లులు బతుకుల్ని నెట్టుకుపోతుండేవాళ్లు. మొగుడి గలాటా ఆగకున్నా... కుక్క మాత్రం నోర్మూసుకుని బలవంతంగా మెడకున్న చైనుని అటుఇటూ విదిలిస్తూ చెట్టు సందున దూరేది. దాని మెడ మీద కొంత చర్మం పొడై జుట్టు ఊడిపోవడమూ కుర్రాడు గమనించాడు. వీధికుక్కలూ తాగుబోతోళ్లకు అలవాటైపోయాయి. ఒకడైతే అందులో ఒకదానికి రోజూ మందు కొట్లో మిగిలిపోయిన బొయికలూ, ముక్కలూ తెచ్చిపడేస్తాడు. చంకనెక్కించుకుని ముద్దు చేస్తుంటాడు. వాటి మధ్యనే కూర్చుని ప్రపంచ రాజకీయాల చర్చ పెడతాడు. భార్య వచ్చి నేలబారున లాక్కుపోతున్నా వాటెంట చూస్తూ నవ్వుతుంటాడు. కుర్రాడికిది రోజూ అలవాటే. అందుకే ఆ వీధి మధ్యన ఆ అసంకల్పిత ప్రతీకార చర్య.

• •

కొన్ని వీధులకు నిద్రాహారాలు ఉండవు. ఎన్నో... పని నుంచి వచ్చే ఇంటోళ్ల కోసం ఎదురుచూపులు, పెట్టిళ్ల ఉక్కబోతలకు పడిగాపులు.. పిల్లాజెల్లా అంతా రోడ్డు మీదే. ఎంతసేపని కాళ్ల ముడుచుకుని కూర్చునేది. అందుకే వాడు సైకిల్‌ని సిమెంట్ రోడ్డు ఆ బారు నుంచి ఈ బారుకు రౌండ్లు వేసేది. రెండు మూడు రౌండ్లకే తంద్రొచ్చేస్తాడు. ఈసారి చైను తెగేదాక తొక్కినా రాలేదేమో..! సన్నగా ఏడుపూ మొదలెట్టాడు తల్లి ఒడిచేరి. దూరాన ఊగే నీడలతోనే భర్తల్ని పోల్చుకోగలిగేంత తాగుడు జబ్బులు ప్రతి ఇళ్లకు దగ్గేస్తున్నాయి. వెన్నెల విరగ్గాస్తోంది. పోటీగా వీధి లైట్లది కొత్త తెల్ల వెలుగులే. సిమెంట్ రోడ్డు అద్దమైంది. ప్రతి నీడా చాలా స్పష్టంగా కదులుతోంది. పదడుగుల రోడ్డు అడ్డానికి ఓ మీటరు గీసుకుని వచ్చేవాళ్లు ఎంత తాగారో...! ఫ్లక్చుయేషన్‌తో అంచనా వేసేయొచ్చు. పిల్లాడు పక్కన పడేసిన సైకిల్‌ని కుర్రాడు ఓ చేత్తో పైకిలేపి వాళ్లింటి ముందు పెట్టాడు. పరిచయమున్న మనిషే కదా..! 'అన్న ఇంకా రాలేదా..' అని పిల్లాడి తల్లిని అడిగేసి మరో అడుగు ముందుకేశాడు. వీధి కుక్కలు మొరుగుతున్నాయి. వాటి కమ్యూనికేషన్ వ్యవస్థ అంచెలంచెలుగా ఉంటుందేమో..! మరో మూడు నాలుగు వీధి మలుపులూ అరుపులందుకున్నాయి. వచ్చేది ఆ అన్న కాదని.. అతడే అయితే, ఈ చిన్నోడి బాధ తగ్గేదని మనసులోనే అనుకుంటూ వెనక్కు తిరిగి చూసుకుంటూ కుర్రాడు మరో నాలుగు అడుగులు వేశాడు. ఏదో ఆటో టకటక శబ్దం ఆ దారిలోకే ప్రవేశించింది. పేరుకు పది అడుగులే కానీ, గాలిని ఉగ్గబెట్టి ప్రాణాల్ని మగ్గబెట్టే ఇరుకు ఇళ్లన్నీ... కుర్చీలో, వైరు మంచాలేసుకుని ముంగాళ్ల చాపుకుంటాయి. దానికితోడు బైక్‌లు, సైకిళ్ల పార్కింగ్. ఆటో ఆ దారి దాటాలంటే.. ఇలాంటి కుర్రాళ్లే సందు సందునా దారి చేయాలి. కుర్రాడికి ఆటోవాలా చెప్పకుండానే అర్థమైంది. గబగబావెళ్లి ముందు అడ్డున్న బండిని పక్కకు వంచి పట్టుకున్నాడు. ఆటో దాన్ని దాటగానే మళ్లీ వేగంగా వెళ్లి ఓ ఖాళీ మంచం అడ్డుతీశాడు. ఇలాంటి కుర్రోళ్లకు.. అలాంటి పక్కిళ్లవారి బళ్ళు, కుర్చీలు, మంచాలు, సామాన్లు... పబ్లిక్కైపోతాయి. ఎవరైనా వాటిని పక్కకు తీయొచ్చు.

• •

ఆటో వెనుకే కొన్ని కుక్కలు తోకూపుకుంటూ నడిచాయి. వీధి దాటి సర్రున ఆటో దూసుకుపోయాక మళ్లీ అరుచుకుంటూ వెనక్కు తిరిగి కుర్రాడికి ఎదురొచ్చాయి. కుర్రాడి వాలకాన్ని అదోలా చూసి పక్కగా వెళ్లిపోయినాయి. అవి రివర్స్ రూట్ కదా...! వీధి మధ్యకు నడవగానే ఎడమవైపుకు వెళ్లకుండా జాగ్రత్త పడ్డాయి. అంతకుముందు కుర్రాడు భయపడి పక్కకు దూకిన ఓ ఇంటోళ్ల కుక్క స్పాట్ దగ్గర. ఏమనుకున్నాయో..! అక్కడే ఆగి ఆ చెట్టు వైపే చూశాయి. అంతకుముందు భయం, కంగారులో కుర్రాడు ఆ చెట్టును సరిగ్గా చూడనేలేదు. ఇప్పుడు మాత్రం వెన్నెల వెలుగుకో, వీధిదీపాల కాంతికో తెలీదు గానీ, అదే చెట్టుకు కట్టేసి ఉంచిన కుక్క చైను కళ్లల్లో పడింది. ఆ చెట్టుకు మరీ దగ్గరలోని ఇంటాయన ఒకరు తాగి మెట్లపైనే కునికిపాట్లు పడుతున్నాడు. ఇంటావిడ వచ్చి నెత్తి కింద దిండు సర్ది



దుప్పటి కప్పి తలకాడే కూర్చుంది. ఎన్నేడుపులు అయ్యాయో బాధకు కన్నీళ్లందాలి కదా..! కళ్లెంట ధార కట్టకపోతే... కళ్లు ఒకటే మండి నిప్పు సూరీళ్లవుతాయి. అందుకేనేమో.. ఆమె కళ్లను తెగ నులుముకుంటోంది. కునికిపాట్లను ఆవలిస్తోంది. ఇంతలో ఆ ఇంటి చిన్నారి బయటకొచ్చి తల్లిని తండ్రిని చూసుకుని కళ్లు నలుపుకుంటూనే లోనికెళ్లిపోయింది. కుర్రాడి ఆలోచన ఆ ఇంటి వరండా నుంచి మళ్లీ చెట్టు మొదలకు చుట్టుకున్న చైను చుట్టూనే తిరిగింది. వీధిలో ఆ కుక్క గురించి చాలా గొడవలే జరిగాయి. అన్నేసి వీధి కుక్కలు స్వేచ్ఛగా దారెంట తిరుగుతున్నా... దాని అరుపులకి, కొత్తోళ్లు, పాతోళ్ల మీదకు ఎగబడే లక్షణానికి ఆ చెట్టుకే రోజంతా బంధీ అవుతుంది. ఆ ఇంటి అబ్బాయి వచ్చి కాసేపు అలా అలా తిప్పి లోనికి తీసుకెళ్లినప్పుడే అది మామూలుగా అవుతుంది. మిగతా సమయమంతా గొడవే. లోనికి తీసుకెళ్లాక కిక్కురుమనదు. ఎన్ని కాలి దెబ్బలు తిందో. మిగతా వీధందిరితోనూ ఆ కుక్క గురించే గొడవ పెట్టుకునే ఆ ఇంటావిడ... ఆ అబ్బాయి వచ్చాక అతడితోనూ అదే గొడవ కొనసాగిస్తుంది. వీధి మలుపులో ఓ బైక్ తిరిగింది. అది నిదానంగా రావడంలో ఆశ్చర్యంలేదు. వీధి కుక్కల్ని పక్కకు లేపాలి. చిన్నారుల ఆటల్లోంచి బయటపడాలి. పట్టె మంచాల పక్కలకు తగలకుండా సైడ్ తీసుకోవాలి. అది నిదానంగా వస్తోన్నా దాని నీడ తూగుతోంది. ఇదివరకూ ఆ వీధిలో మనిషి తూగుతూ నడిచొచ్చే నీడనే కుర్రాడు చూశాడు గానీ, ఇది కొత్త. తాగి ఇంటిని గుల్ల చేయడం తప్పు కాదనుకునే వీధి లెక్కల్లోనూ... తాగి బండి నడపడం నేరమే కదా..! అనుకున్నాడు. ఇంతకీ ఈ కొత్త తాగుబోతు ఎవరా అనుకుంటూ పక్కకు జరిగి నిల్చొని చూస్తున్నాడు. వీధి కుక్కలు ఏదో శోకాన్ని ఊల వేస్తున్నాయి.

బండి సరాసరి వచ్చి ఆ పెంపుడు కుక్కను కట్టేసే చెట్టు దగ్గరకొచ్చి ఆగింది. ఆ ఇంటి అబ్బాయి బండి దిగాడు. తాగినవాడి మల్లే లేడు.. బాగా ఏడ్చిఏడ్చి సత్తువ కోల్పోయినోడిలా ఉన్నాడు. దిగీదిగ్గానే చెట్టు దగ్గరే కూలబడ్డాడు. ఖాళీ చైనుని చేతుల్లోకి తీసుకుని గుండెలకు రాసుకుంటున్నాడు. కొన్ని వీధి కుక్కలు కుర్రాడి దగ్గర వరకూ వచ్చి తల పైకికిందకు ఊపుతూ ఏదో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాయి. దాదాపు వీధంతా నిద్రబోతోంది. సైకిల్ చైను చిన్నోడి తండ్రి ఇంకా రాలేదట్టుంది.. తల్లి చైను సరిచేసే ప్రయత్నంలో ఉంది. వాళ్ల దగ్గరకొచ్చిన మిగిలిన వీధి కుక్కలు పిల్లాడికి ఏదో వ్యక్తం చేస్తూ పిల్లాడి చుట్టూ తిరుగుతున్నాయి. వాటిని తల్లి విసురుకోగానే ఆమె వీపుకు ఆనుకుని ఆ చిన్నారి వీధి చివర్లో కదలాడుతోన్న చెట్టు కొమ్మల నీడల్ని కళ్లింతలు చేస్కుని చూస్తున్నాడు.. వాటి మధ్యలో తూలే నీడ నాన్నదేమోనని. అబ్బాయి పెంపుడు కుక్కను ఎక్కడో విడిచివచ్చాడు. చిన్నారి తండ్రి బెల్ట్‌షాపునింకా వదిలిరాలేదు. వీధికుక్కలకు కొన్ని రాకపోకలర్థమౌతాయి. అన్నీ ఒకచోటే మూగి పెంపుడు కుక్క కోసం, కుర్రాడి తండ్రి కోసం ఎదురుచూస్తున్నట్టే... వీధి చివరి వైపు చూస్తూ ఓ రకపు అరుపు మెల్లిగా అందుకున్నాయి.

✦

కిసుక్కు సిత్రం

ఒక్క పనీ తిన్నగా చేయవ్..!

డబ్బుపోతు

ఇల్లస్ట్రేటర్ : గెర్హార్ట్ హేడర్



లెక్కల మ్యూజియం

ప్రత్యేకం

మీరిప్పటి వరకూ రకరకాల మ్యూజియాల గురించి వినే ఉంటారు. మరి మీరెప్పుడైనా గణితానికి సంబంధించిన మ్యూజియం గురించి విన్నారా? ఈ మ్యూజియం ఉంది మరెక్కడో కాదు చెన్నైలోనే. ఇంతకీ ఈ మ్యూజియం పేరేంటో తెలుసా రామానుజన్ మ్యూజియం. భారతీయ గణిత దిగ్గజం రామానుజం పేరున ఈ ఏడాది అక్కడి శాస్త్రా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన ఆ మ్యూజియం గురించి మీరూ తెలుసుకోండి.

అతి పిన్న వయసులో గణితంలో పెద్ద పరిశోధనలు చేయడమే కాదు రామానుజన్ ప్రైమ్, రామానుజన్ తీటా ఫంక్షన్, మాక్ తీటా ఫక్షన్ ఇలా దాదాపు 3900 సమీకరణాల్ని కనిగొన్న భారతీయ గణిత మేధావి రామానుజన్ గురించి తెలీనివారుండరు. గణితంలో తను చేసిన పరిశోధనలు ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ గణిత ప్రొఫెసర్ జి. హెచ్.హార్డీని సైతం అబ్బురపరిచాయంటే రామానుజన్ ప్రతిభ అర్థం చేసుకోవచ్చు. అలాంటి గొప్ప ప్రతిభాశాలి పరిశోధనల్ని నేటి తరానికి పరిచయం చేసేలా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆయన పేరున ఒక మ్యూజియంను ఏర్పాటు చేశారు. రామానుజన్ పుట్టిపెరిగింది చెన్నైలోని కుంభకోణంలో. అక్కడి సారంగపాణి వీధిలోనే రామానుజన్ ఇల్లు. ఒక చిన్న పెంకుటిల్లు అది. ఈ మ్యూజియంను ఏర్పాటు చేసింది కూడా అక్కడే. రామానుజన్ ఇంటిని ఒక మ్యూజియంగా తీర్చిదిద్దాలనే ఆలోచన చేసింది అక్కడి శాస్త్రా విశ్వవిద్యాలయం. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఈ ఆలోచనకు బీజం పడింది. ఇక ఈ ఇంటిలోకి అడుగుపెట్టగానే మొట్టమొదట మనకు ఒక పెద్ద గది కనిపిస్తుంది. ఆ గదిలోని ఒక కిటికీ వద్దే కూర్చొని రామానుజన్ ఎక్కువగా ఆలోచించేవాడట. ఈ గదిని దాటి కాస్త ముందుకెళితే మరో గది కనిపిస్తుంది. ఇక్కడే ఒక నీలం రంగు ఫలకంపై రామానుజానికి సంబంధించిన వివిధ విషయాలతోపాటు ఆయన కనుగొన్న గణిత సూత్రాల్ని అంటించి ఉంచారు. వీటితోపాటు రామానుజన్ ఛాయాచిత్రాలతో ఒక ఫొటో గ్యాలరీ కూడా ఏర్పాటు చేసారు. ఇవే కాదు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఆయన చేసిన పరిశోధనలకు సంబంధించిన పత్రాలను కూడా ఇక్కడ చూడొచ్చు.

ఇంగ్లండ్ ప్రొఫెసర్ జీహెచ్ హార్డీకి రామానుజన్ రాసిన రెండు లేఖలతోపాటు వాటికి హార్డీ పంపిన ప్రత్యుత్తరాల్ని ఈ మ్యూజియంలోనే వీక్షించవచ్చు. వర్గమూలాల్ని కనుగొనేందుకు రామానుజన్ ఉపయోగించిన పద్ధతులు కొన్ని మరో ఫలకంపై కనిపిస్తాయి. ఇలా ఈ మ్యూజియంలో ఎటు చూసినా రామానుజన్ గణితానికి సంబంధించిన వివిధ అంశాలు అణువణువునా దర్శనమిస్తాయి. చిన్న పెంకుటింట్లో ఉన్న ఈ మ్యూజియం ఇప్పుడు ఎంతోమంది విద్యార్థులతోపాటు రీసెర్చ్ స్కాలర్లను ఆకట్టుకుంటోంది. ఇక ఈ మ్యూజియంను సందర్శించడానికి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అనుమతిస్తారు. అరగంట భోజన విరామం తర్వాత తిరిగి 1:30కి నుంచి సాయంత్రం 6 గంటలవరకు సందర్శనలుంటాయి. ఈ మ్యూజియంను ఎలా చేరుకోవాలనేది స్థానికులకు తెలుసు. కానీ ఎలాంటి రూట్ మ్యాప్‌లు లేకపోవడంతో కొత్తవారికి ఇక్కడి చేరుకోవడం కాస్త కష్టమౌతోంది.

- శారద



సరుకుల నుంచి గృహోపకరణాలు, ఫోన్ కవర్లు ఇలా ఏ వస్తువును ప్యాక్‌చేయాలన్నా ప్లాస్టిక్‌ను వినియోగించాల్సిందే. పర్యావరణ స్పృహ లేకుండా ఇలా విచ్చలవిడిగా మనం ఉపయోగించే ప్లాస్టిక్ ఇప్పుడు పర్యావరణానికీ పెద్ద హాని తలపెడుతోంది. ఈ ప్రమాదం నుంచి మనం బయటపడాలంటే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల్ని ఉపయోగించాల్సిందే. అలాంటి ఓ ఆలోచనతోనే ఇప్పుడు కొందరు భారతీయ యువకులు ముందడుగేస్తున్నారు. ఆ వివరాలేంటో మీరూ తెలుసుకోండి.

ఓ పచ్చని ఆలోచన

వినూత్నం

పర్యావరణ -అటవీ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం మన దేశంలో రోజుకు 15 వేల టన్నుల ప్లాస్టిక్ వెలువడుతోందనేది ఒక అంచనా. వీటిలో రీసైక్లింగ్ కోసం సేకరిస్తోంది కేవలం 9 వేల టన్నులు మాత్రంమే. అంటే మిగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ భూమిపైనో, సముద్రాల్లోనో పేరుకుపోతున్నాయి. ఇక ప్రతి చిన్న వస్తువుకీ ప్లాస్టిక్‌ను వినియోగించేస్తూ పర్యావణ స్పృహ లేకుండా మనం చేసే తప్పిదం సముద్రజీవాలతోపాటు పర్యావరణానికీ హాని కలిగిస్తోంది. ఇలా ప్లాస్టిక్‌కు బదులు సహజసిద్ధమైన వస్తువుల్ని వినియోగించే దిశగా అశ్వత్ హెగ్డే చేసిన ఆలోచనే ఎన్విగ్రీన్. భారతీయ సంతతికి చెందిన వ్యక్తి హెగ్డే. ప్రస్తుతం ఖతార్‌లో వ్యాపారవేత్తగా రాణిస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఓ సెమినార్‌కు హాజరయిన హెగ్డే వివిధ దేశాలతోపాటు భారత్‌లో ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరస్థాయికి చేరిందనే విషయాన్ని తెలుసుకున్నాడు. అప్పుడే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల్ని తయారుచేయాలనే ఆలోచన బలపడింది. అలాంటి ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే 'ఎన్విగ్రీన్' సంస్థ. త్వరలో బెంగుళూరులో ఈ సంస్థ ప్రారంభంకానుంది. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా క్యారీ బ్యాగ్‌లను తయారుచేసి అందించే లక్ష్యంతో పనిచేస్తోంది ఎన్విగ్రీన్ సంస్థ. వివిధ మొక్కల్లో ఉండే పిండిపదార్థాలు, కూరగాయల వ్యర్థాలు, నూనెలను వినియోగించి తయారుచేసే ఈ బ్యాగ్‌లు మట్టిలో త్వరగా కరిగిపోతాయి. అతి తక్కువ ఖర్చుతో వీటిని తయారుచేయడంతోపాటు తక్కువ ధరలోనే వీటిని అందించనుంది ఎన్విగ్రీన్. ప్లాస్టిక్ వినియోగం వల్ల వెలువడే కాలుష్యం పర్యావరణానికి ఎంత ప్రమాదకరం కానుందో దాదాపు అందరీ తెలిసిందే. అయితే ఈ విషయాన్ని అంతగా పట్టించుకోకుండా మనపనిమనం చేసుకుపోతుండడం మరో ప్రమాదానికి దారితీస్తుందనేది తన అభిప్రాయం.

ప్యాకింగ్ అంటే ప్లాస్టిక్ కవర్లు తప్ప మరే ఇతర వస్తువూ లేదనేంతలా మనం ప్లాస్టిక్‌ను ఉపయోగించేస్తున్నాం. ఆహార పదార్థాలు, సరుకులు ఇలా ఏ వస్తువు ప్యాక్ చేయాలన్నా ప్లాస్టిక్ కవర్లని ఉపయోగించాల్సిందే. కొన్ని ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులున్నా వాటి ఖరీదు ఎక్కువే ఉండడంతో చాలావరకు వీటిని ఉపయోగించలేకపోతున్నారు. ఇలాంటి సమస్యకు సెలోఫేన్ ఆలోచనతో ముందుకొచ్చారు ఐఐటి మద్రాస్ విద్యార్థులు ప్రణీత్, శ్రీవంత్, శాంతిని. ఒక పల్చని టేబుల్ కవర్‌ను పోలుండే ఈ సెలోఫేన్‌ను ఆహార పదార్థాలతోపాటు ఇతర ప్యాకింగ్‌లకు ఉపయోగించుకోవచ్చు. మొక్కల్లోని సెల్యులోజ్‌ను ఉపయోగించి తయారుచేసి ఈ కవర్లు మన ఆరోగ్యానికే కాదు; పర్యావరణానికీ ఎలాంటి హానీ కలిగించవు. ప్రస్తుతం అరటి పండుతొక్క, వెదురు, కాటన్ దుస్తుల్ని ఉపయోగించి మరికొన్ని ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల్ని తయారు చేస్తున్నారు ఈ ముగ్గురూ. మరో సంస్థ శూన్య ఆల్టర్నేటివ్. టూత్ బ్రష్‌లు, స్ట్రాలు, శానిటరీ న్యాప్‌కిన్స్ ఇలా మనం ఉపయోగించే ఎన్నో వస్తువుల్ని సహజసిద్ధమైన వనరులతో తయారు చేస్తోందీ సంస్థ. ఇలా భారతీయ యువత ప్రస్తుతం ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల్ని తయారుచేయడంతోపాటు ప్రకృతి పరిరక్షణ లక్ష్యంతో ముందడుగేస్తోంది. ★





అష్టమి కథ

ఆటపాటల దసరా

దసరా అంటేనే సరదాలకు లేపిన పరదా. ఆటపాటల వరద. ఊరూరా పందిళ్లూ సందళ్లూ .. అనేకనేక సాంస్కృతిక సంరంభాలూ సంబరాలూ. ఈ పండగ వెనక చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. పోల్చి చూస్తే ఒకదానికొకటి పొంతన ఉండదు. ఆలోచిస్తే సంబంధం కుదరదు. ఎవరి కథలు వారికి కారణాలుగా ఉండడమే భిన్నత్వం. ఆ కథాకథనాలు ఉన్నా- దేశవ్యాప్తంగా కోట్లాదిమంది పండగ సందడిలో మునిగి తేలడమే ఏకత్వం. అందుకే ఇది భిన్నత్వంలో ఏకత్వంలా అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ. పిల్లలూ పెద్దలూ మహిళలూ.. ఆటలపాటలతో, సాంస్కృతిక సందళ్లతో సంతోషంగా గడిపే పండగ. వివిధ ప్రాంతాల్లో, వివిధ రూపాల్లో జరుపుకునే దసరా.. ఒక సాంస్కృతిక ప్రాభవానికి చిరునామా.

ఆశ్వయుజ మాసంలో పాడ్యమి నుంచి నవమి వరకూ తొమ్మిది రోజులూ దేవీ నవరాత్రులని, పదో రోజు విజయ దశమి అని అంటారు. ఈ రెండూ కలిసి దసరా. దసరా అంటే సరదాలకు, సందళ్లకు మరొక పదం. ఆటలకు, పాటలకు ఆలవాలం. దేశమంతటా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పద్ధతిలో ఈ పండగ జరుగుతుంది. శరదృతువు ఆరంభంలో వచ్చే సందళ్లు కనుక వీటిని శరన్నవరాత్రులు అని కూడా అంటారు. తెలుగు వారు దసరాని పది రోజులు జరుపుకుంటారు. తెలంగాణాలో ఈ తొమ్మిది రోజులూ... అమావాస్య నుంచి నవమి వరకూ బతుకమ్మ ఆడతారు.

దసరా పండగకు గల కారణాలుగా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. కాలక్రమంలో ఏ పండగకు అయినా కారణాలతో సంబంధం ఉండదు. జనం దృష్టిలో కేవలం సందడీ సరదాలే ఉంటాయి.రావణుడిపై రాముడు విషయం సాధించిన రోజు అని ఒక కథ. పాండవులు అజ్ఞాతవాసం ముగించి జమ్మిచెట్టు మీద నుంచి ఆయుధాలు తీసుకున్న రోజు అని మరొక కథ. మహిషాసురుడిని దుర్గాదేవి వధించిన రోజు అని ఇంకొక కథ. విశ్లేషించి చూస్తే ఈ కథల మధ్య సామీప్యత కానీ, సమంజసత్వం కానీ కనిపించవు. పురాణాల ప్రకారం చూసినా- రామాయణ, భారతకథల మధ్య కొన్ని వేల సంవత్సరాల అంతరం ఉంది. ఎక్కువగా దుర్గాదేవి పండగగా, స్త్రీ శక్తి ప్రతీకగా చూస్తారు. మరి అసలు కారణం ఏమై ఉంటుంది అంటే - ఎవరి కథ వారికి ఉంటుంది.

నిజానికి సామాన్య జనానికి ఈ కథలతో సంబంధం లేకుండా - ఈ సందర్భాన్ని ఓ సందడిగా, సరదాగా భావిస్తారు. ఉన్నంతలో దసరాను ఆనందంగా గడిపేస్తారు.

మనది భిన్నత్వం గల దేశం. వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు సమూహాల్లో వేర్వేరు సంస్కృతీ సాంప్రదాయాలు ఉంటాయి. అవి దేశ వైవిధ్యానికీ, భిన్నత్వపు సౌందర్యానికీ చిహ్నాలు. కానీ, రాన్రానూ ఈ సాంస్కృతిక భిన్నత్వం బలహీనపడుతోంది. అదే సమయంలో బలమైన స్వరంగానూ వినిపిస్తోంది. చాలా పండగల విషయంలో ఉత్తరాది, దక్షిణాది మధ్య అంతరాలు కనిపిస్తాయి. రామాయణంలోని రావణుడు ఉత్తరాదిలో విలనైతే- తమిళనాడులో నాయకుడు. అక్కడ రావణున్ని నిందిస్తే ఇక్కడ పూజిస్తారు. దీని వెనక కథలో వైరుధ్యాలు, సాంస్కృతిక కారణాలే కాదు; సామాజిక, చారిత్రిక కారణాలు కూడా ఉన్నాయి. దీపావళి కథల వెనక కూడా ఇలాంటి కారణాలే ప్రచారంలో ఉన్నాయి. ఆర్యులు దేశాన్ని ఆక్రమిస్తూ, ఆధిపత్యంలోకి వస్తూ... అప్పటికే ఇక్కడ నివాసం ఉన్న వారిపై సంధించిన సాంస్కృతిక ఆధిపత్య ఆయుధాలే ఈ కథలన్నీ అని చరిత్రకారులు చెబుతున్నారు. అయితే, ఇంతలోతుగా ఆలోచించకుండానే అత్యధిక ప్రజానీకం ఈ పండగలను ఆనందంగా జరుపుకుంటారు. దసరా రోజుల్లో ఒకప్పుడు వివిధ వేషాలు వేసుకొని గ్రామాల్లో సందడి చేసే కళాకారులు ఉండేవారు. ఇంటింటికీ తిరిగి దానం స్వీకరించేవారు. దసరా సంబరాల్లో ఇప్పటికీ ఈ వేషాలు కనిపిస్తాయి. సినిమాలూ, టీవీలూ లేని రోజుల్లో ఈ వేషధారులే చూసేవారికి కనువిందు. పిల్లలకు ఆనందం.

వివిధ ప్రాంతాల్లో దసరా

దసరా ఉత్సవాలను దేశమంతా వివిధ రూపాల్లో జరుపుకుంటారు. మైసూరు దసరా ఉత్సవాలు, కలకత్తా సంబరాలూ దేశంలో చాలా ప్రసిద్ధి. మైసూరులో 400 ఏళ్ల నుంచి దసరా ఉత్సవాలను జరపటం ఆనవాయితీ. అప్పటి మహారాజు ఆధ్వర్యంలో చాముండేశ్వరీ దేవిని

ఆరాధించి ఏనుగులపై ఊరేగించేవారు. అదే ఒరవడి ఇప్పటికీ కొనసాగుతోంది. మైసూరు వీధుల్లో కోలాహలంగా చేసే కళా ప్రదర్శనలు చూడటానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారు. రాజభవనాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ప్రదర్శనలో ముందు భాగాన ఏనుగులు పాల్గొనటం ప్రత్యేకత. ఆ ఏనుగుల అలంకరణ కూడా నేత్రపర్వమే! ఆయుధపూజ వైభవంగా నిర్వహిస్తారు.

బెంగాల్లో దుర్గాపూజ సందర్భంగా వీధులు ధగద్ధయామానంగా వెలుగొందుతాయి. సప్తమి, అష్టమి, నవమి తిథుల్లో దుర్గామాతకు పూజ చేసి తొమ్మిదో రోజున కాళికామాతను దర్శిస్తారు. లక్షలమంది పాల్గొంటారు. తొమ్మిది రోజులూ రాష్ట్రమంతా పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజున దుర్గామాత విగ్రహాలను హుగ్లీ నదిలో నిమజ్జనం చేస్తారు. ఈ ఉత్సవాల పందిళ్లలో పుస్తకాల ప్రదర్శనలు నిర్వహించే ఆనవాయితీ బెంగాల్లో ఉంది. సామరస్యపూర్వకంగా సందడిని ఆస్వాదించే సాంస్కృతిక వాతావరణం అక్కడ ఉంది. అయితే, ఇటీవలి కాలంలో మత సంబంధ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యానిచ్చే ఒరవడి అక్కడ కూడా ప్రారంభమైంది. ఒడిశాలో దసరా సమయంలో దుర్గాదేవిని ఆరాధిస్తారు. కటక్ కళాకారులు రూపొందించిన విగ్రహాలను వీధుల్లో ప్రతిష్ఠిస్తారు. స్త్రీలు మానికలో వడ్లు నింపి పూజలు నిర్వహిస్తారు. దీనిని వారు మానబాన అంటారు. దసరా రోజున బాణసంచా కాలుస్తారు.

తెలంగాణాలో బతుకమ్మ

తెలంగాణా ప్రజలు దసరా సమయంలో బతుకమ్మ ఉత్సవాలు చేస్తారు. ఇది ఆ రాష్ట్రం అధికారిక పండగ. ఈ పండగను తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ పండగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. నవరాత్రి మొదట రోజున బతుకమ్మను పూలతో అలంకరించి తొమ్మిది రోజులు స్త్రీలంతా ఒకచోట చేరి ఆటపాటలతో ఆనందిస్తారు. చివరి రోజున బతుకమ్మను నిమజ్జనం చేస్తారు. ఈ రోజుల్లో ఆడపడుచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి చేరుకుంటారు.

ఆడపడుచులంతా ప్రతి సాయంత్రం బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడుతారు. బతుకమ్మ చివరి రోజు అత్యంత మనోహరంగా ఉంటుంది. ఆ రోజు పచ్చిక బయళ్ళలోకి పోయి తంగేడు, గునుక పూలను, ఇంకా రకరకాల్ల పూలను భారీగా ఏరుకుని వస్తారు. ఇంటిల్లిపాదీ కూర్చుని ఆ పూలతో బతుకమ్మని తయారు చేస్తారు. గునగ పూలు, తంగెడు పూలు ముఖ్య భూమికను పోషిస్తాయి. ఈ పూలని జాగ్రత్తగా ఒక రాగి పళ్ళెంలో వలయాకారంగా, రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ముందుగా తంగేడు ఆకులు, పూలు పేర్చుతారు. ఆపై తంగేడు పూలతో కట్టిన కట్టలను పేర్చుతారు. మధ్య మధ్యలో ఇతర రకాల పూలను ఉపయోగిస్తారు. పేర్చడం అయ్యాక పైన పసుపుతో చేసిన గౌరి మాతను పెట్టి చుట్టూ దీపాలతో అలంకరిస్తారు. ఇలా తయారు చేసిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడతారు. ఇలా చాలాసేపు ఆడాక దగ్గర్లో ఉన్న చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై ఆ పళ్లెంలో తెచ్చిన నీటితో ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. ఉత్తరాంధ్రలో గౌరమ్మ పేరిట ఈతరహా సంబరాలే జరుగుతాయి.

కరీంనగర్‌లో గని కార్మికులు ఈ పండుగను గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా జరుపుకుంటారు. ఆయుధ విన్యాసాలను ప్రదర్శిస్తారు. అక్కడి నెహ్రూ స్టేడియంలో నరకాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శించడంతో పండగ మొదలవుతుంది. ఇనుప బెల్టు, త్రిశూలం మొదలైన ఆయుధాలను పట్టుకొని విన్యాసాలు చేస్తూ ఊరంతా తిరుగుతారు. జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకుంటారు.

గుజరాత్‌లో ...

దసరా సమయంలో ఇంటింటా శక్తి పూజ చేయడం గుజరాతీయుల ఆచారం. పొలం నుంచి తీసుకు వచ్చిన మట్టితో వేదిక తయారు చేసి.. దానిపై బార్లీ, గోధుమ విత్తనాలను చల్లి.. ఆపైన మట్టి కుండ పెడతారు. దానిని నీటితో నింపి.. పోకచెక్క, వెండి లేక రాగి నాణెం వేస్తారు. ఆ మట్టికుండనే దేవిగా భావిస్తారు. దానినే కుంభీ ప్రతిష్ట అంటారు. అష్టమి రోజున పూజ నిర్వహించి దశమి రోజున నిమజ్జనం చేస్తారు. తరువాత పౌర్ణమి వరకూ జరిగే గర్బా ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొంటారు. దాండియా పాటలూ, ఆటలతో గొప్ప సందడిని, ఉత్సాహాన్నీ సృష్టిస్తారు.

విజయవాడలో భేతాళ నృత్యం

మనకు దసరా అనగానే విజయవాడనే గుర్తొస్తుంది. ఇక్కడ తొమ్మిది రోజులూ వైభవంగా ఉత్సవాలు నిర్వహించి విజయదశమి రోజున కృష్ణా నదిలో తెప్పోత్సవం జరుపుతారు. తర్వాత అమ్మవారిని పాత నగరంలో ఊరేగిస్తారు. ఊరేగింపు వన్ టౌన్ పోలీసు స్టేషను వద్దకు రావడంలో ఉత్సవం ముగుస్తుంది. చివరిరోజు ప్రభలు ఊరేగింపుగా వస్తాయి. ఈ సందర్భంగా ప్రదర్శించే భేతాళ నృత్యం విజయవాడ ప్రత్యేకత.

వీరవాసరంలో ఏనుగు సంబరం

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో సుమారు వందేళ్ల నుంచి దసరా సమయంలో ఏనుగు సంబరాలు జరపడం ఆనవాయితీ. నవరాత్రుల తొలిరోజున ఏనుగు గుడిలో భేతాళు డిని నిలబెడతారు. భేతాళుడంటే వయసైన బ్రహ్మచారి. తొమ్మిది రోజులు భేతాళుడు అమ్మవారి పూజలు నిర్వహిస్తాడు. ఈ సంబరానికి వెదురు కర్రలు, గడ్డి, కొబ్బరిపీచుతో చేసిన ఏనుగును అంబారీతో అలంకరిస్తారు. తెల్లని వస్త్రానికి రంగుల లతలు, కాగితంపూలు, తగరంతో అలంకరణలు చేస్తారు. కొత్తగా చిన్న ఏనుగును తయారు చేసి .. దానినీ అలంకరిస్తారు. చివరిరోజున ఊరేగింపుగా తీసుకు వెళతారు. ఈ ఊరేగింపులో పిల్లలను ఏనుగు కింద నుంచి దాటిస్తారు. సంబరాన్ని సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభించి తెల్లవారు ఆరు గంటలవరకూ జరుపుతారు.

విజయనగరంలో సిరిమాను

విజయనగరంలో దసరా సమయంలో గజపతుల ఆడపడుచైన పైడితల్లికి పూజలు చేస్తారు. దసరా వెళ్ళిన తరువాత వచ్చే మొదటి మంగళవారం జాతర జరుపుతారు. ఈ ఉత్సవంలో పూజారిని సిరిమాను ఎక్కించి అమ్మవారి గుడి ఉన్న మూడు లాంతర్ల సెంటర్ నుంచి కోట వరకూ మూడుసార్లు ఊరేగిస్తారు. ఈ సిరిమాను సంబరం చూడటానికి ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిమందీ వస్తారు.

రాళ్ళయుద్ధం.. కర్రల కొట్లాట

కర్నూలు జిల్లాలోని వీపనగండ్లలో దసరా సమయంలో రాళ్ళయుద్ధం చేసుకుంటారు. దసరా రోజు సాయంత్రం ప్రజలు కాలువ ఒడ్డున కంకర రాళ్ళను గుట్టలుగా పోసుకుంటారు. ఒకవైపు రామసేన, ఒకవైపు రావణ సేనగా ఏర్పడి ఒక గుంపుపై మరొక గుంపువారు రాళ్ళను విసురుతూ యుద్ధం చేసుకుంటారు. ఎంత ఎక్కువగా దెబ్బలు జరిగితే అంత బాగా ఉత్సవం జరిగినట్టుగా వారు ఉత్సాహపడతారు. ఇదే జిల్లాలోని దేవరగట్టులో కూడా బన్ని ఉత్సవం జరుగుతుంది. మాల మల్లేశ్వరస్వామి విగ్రహాన్ని తమ గ్రామానికి తీసుకెళ్లేందుకు దాదాపు 18 గ్రామాల ప్రజలు... పోటీ పడతారు. స్వామిని తీసుకువెళ్లేందుకు ఓ గ్రూపు, తమ గ్రామంలోనే ఉండేలా ఇంకో గ్రూపూ వెదురుకర్రలతో విపరీతంగా కొట్టుకుంటారు. ఎంత గాయాలైనా పట్టించుకోరు.

బందరు శక్తి పటాలు

కృష్ణా జిల్లా బందరులో దసరా సందర్భంలో శక్తి పటాల ఊరేగింపు నిర్వహిస్తారు. వందేళ్ల క్రితం ఈ ప్రాంతానికి చెందిన ఓ సైనికుడు కలకత్తా నుంచి తెచ్చి మచిలీపట్నం ఈడేపల్లిలో కాళీమాత ప్రతిష్ట చేశాడు. అప్పటినుంచి దసరా సమయంలో ఈ ఆలయం నుంచి శక్తి పటాన్ని పురవీధుల్లో

ఊరేగిస్తారు. పటాన్ని వీపుకు కట్టుకుని ముఖానికి అమ్మవారి ముఖాకృతిని తగిలించుకుని నాట్యమాడుతూ వీధుల్లో తిరుగుతారు. తొమ్మిది రోజులూ ఇలా అన్ని వీధుల్లోనూ ఇంటింటికీ తిరుగుతారు. పటం ధరించినవారు డప్పుల శబ్దానికి అనుగుణంగా వీరనృత్యం చేస్తుంటారు. చివరిరోజు కోనేరు సెంటరుకు తీసుకొచ్చి జమ్మి కొట్టడంతో ఉత్సవం ముగుస్తుంది.

ఒంగోలులో కళారాలు

ప్రకాశం జిల్లా ఒంగోలులో దసరా ఉత్సవాల్లో భాగంగా కళారాల (ముఖాకృతులు)ను ఊరేగిస్తారు. ఈ కళారాలను చక్కగా అలంకరించి సిద్ధం చేస్తారు. ఇక్కడ కాళికాదేవికి, మహిషాసుర మర్ధినికి, నరసింహ స్వామికి కళారాలు ఉన్నాయి. కళారాన్ని బండి మీద ఎక్కించి అటూ ఇటూ పట్టుకోవడానికి అనువుగా కొయ్యలను అమర్చుతారు. డప్పుల మోతలతో ఊరేగింపు నిర్వహిస్తారు. కళారం వెనుక భాగంలో ఒకరు వీరనృత్యం చేస్తూ... కళారాన్ని ఉగ్రంగా ఊపుతూ ఉంటారు. కళారాన్ని ఊరి మధ్యకు తీసుకొచ్చి... అక్కడ రాక్షస సంహారం ఘట్టాన్ని ప్రదర్శిస్తారు.

బొమ్మల కొలువులు

దసరా సందర్భంగా బొమ్మల కొలువు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. దేవతామూర్తులు, పక్షులు, జంతువులు, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే రకరకాల బొమ్మలను కొలువు తీరుస్తారు. ఈ కొలువులో తప్పకుండా ఓ షావుకారు, ఆవు, దూడ బొమ్మలు పెడతారు. తమిళనాడులో కూడా బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు. మధుర మీనాక్షి ఆలయంలో పెట్టే పెద్ద బొమ్మల కొలువు చాలా ప్రసిద్ధి.

తమిళనాడులోని కులశేఖర పట్టణంలో జరిగే దసరాకు ఓ ప్రత్యేకత ఉంది. అక్కడ అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్లేవారు వివిధ వేషాలను ధరిస్తారు. పులి, కోతి, బిక్షగాడు, రాజు, రాక్షసుడు.. ఇలా రకరకాల వేషాలు ధరిస్తారు. 'ప్రతి రూపంలోనూ దేవుడు ఉంటాడు.' అని చెప్పటం దీని ఉద్దేశమట! ఈ ఉత్సవాలకు వందేళ్ల చరిత్ర ఉంది. వేడుకలను చూడటానికి ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు వస్తారు.

పండగలు ఏవన్నా సందళ్లను ఆవిష్కరిస్తాయి. సంతోషాలను పురిగొల్పుతాయి. దసరా కూడా అంతే! ఒక జన సమూహపు సమిష్టి సమ్మేళనానికి, సమైక్య సందళ్లకూ ఇదొక సందర్భం. ఎవరి కథలు వారికి ఉంటాయి. ఆ భిన్నత్వాన్ని గుర్తించాలి. ప్రసార మాధ్యమాలు పెరిగిన క్రమంలో అన్నిచోట్లకూ ఆధిపత్యంలోని ఆటపాటలు ప్రవేశిస్తున్నాయి. ఒకేరకపు సంస్కృతి చొచ్చుకొస్తుంది. సంస్కృతి కూడా గ్లోబలీకరణ, గ్లామరీకరణ, మార్కెట్టీకరణ చెందుతోంది. ఏది పాపులర్‌గా కనిపిస్తే అది .. ఏది ఆకర్షణీయంగా అనిపిస్తే అది .. మూలవిరాట్టులై కూచుంటున్నాయి. పండగలన్నా, వాటిలో ఇమిడి ఉన్న సంస్కృతి అయినా– జనపక్షంగా ఉండాలి. జనానికి చెందినదై ఉండాలి. అప్పుడే పండగలకు సహజత్వపు సొగసు. సందళ్లకు మానవత్వపు మెరుపు!

- స్నేహ డెస్క్

చేత విల్లంబులు.. నోట దసరా పద్యాలు

ఓ 30 ఏళ్ల క్రితం వరకూ దసరా సెలవులప్పుడు ఉపాధ్యాయులు తమ పాఠశాలలో చదువుకునే బాల బాలికలను వెంటబెట్టుకుని గ్రామంలోని ఇంటింటికీ వెళ్ళేవారు. పిల్లలు కొత్త బట్టలు వేసుకుని చేతుల్లో విల్లంబులు పట్టుకుని ఉండేవారు. ఈ అంబులను గిలకలు అంటారు. వీటిని సంధించి వదిలితే, ఎదుటి వారి మీద పూలూ ఆకులు పడేవి. బడి పిల్లలు అలా ఊరంతా తిరుగుతూ పాటలు, పద్యాలు పాడేవారు. వీటినే దసరా పద్యాలు అంటారు. మచ్చుకు కొన్ని చూడండి :

ప్రారంభంలో పాడే పద్యం :

అనయంబు మేము విద్యాభ్యాసమునకు
అయ్యవారిని చాల ఆశ్రయించితిమి
ఈనాటికిని మహానవమి యేతెంచు
ఈడుజోడగువార మెల్ల బాలురము
గురునకు దక్షిణల్ కోరి యూదలచి
వెరవు తోడ మిమ్ము వేడవచ్చితిమి
పాటించి మా ముద్దు పాటలు వినుడు
మేటి కానుకలిచ్చి మెప్పు పొందరయ్య.
ఘనముగా కట్నము గ్రక్కున ఇచ్చి
సెలవియ్యుడీ మాకు శీఘ్రంబుగాను
పట్టుపచ్చడమిచ్చి పది మాడలిచ్చి
గట్టి శాలువలిచ్చి కడియంబులిచ్చి
అయ్యవారికి చాలు ఐదు వరహాలు
పిల్లవాండ్లకు చాలు పప్పు బెల్లాలు
కొబ్బరి కురిడీలు కుండబెల్లంబు

కానుకలు అడిగేటప్పుడు :

ఏ దయా మీ దయా మా మీద లేదు
ఇంత సేపుంచుట ఇది మీకు తగదు
దసరాకు వస్తిమనీ విసవిసలు పడక
చేతిలో లేదనక అప్పివ్వరనక
రేపురా మాపురా మళ్ళీ రమ్మనక
ఇరుగుపొరుగు వారు ఇస్తారు సుమ్మి
గొప్పగా చూడండి తప్పక మీరు
పావలా బేడయితే పట్టేది లేదు
అర్ధ రూపాయతై అంటేది లేదు
ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయైతే పుచ్చుకుంటాము
అయ్య వారికి చాలు ఐదు వరహాలు
పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు
జయీభవా...దిగ్విజయీభవా

కానుకలు ఇచ్చాక .. ఆశీర్వచనాలు :

ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయము లెల్ల వందిగణమై బ్రహ్మాండమాకారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వరసన్నీ ఘన రాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా

కానుకలు ఇచ్చాక .. పొగడ్తలు :

జయీభవా విజయీ భవా
రాజాధిరాజ శ్రీరాజ మహారాజ
రాజ తేజోనిధి రాజ కందర్ప
రాజ కంఠీరవా రాజ మార్తాండ
రాజ రత్నాకరా రాజకుల తిలక
రాజ విద్వత్సభా రంజన మనోజ
రాజీవ ముఖ హంస లక్ష్మీ నివాస
సుజన మనోధీశ సూర్యప్రకాశ
నిఖిల లోకేశ శ్రీ నిగమ సంకాశ
ప్రకటిత రిపుభంగ పరమాత్మ రంగ
వర శిరోమాణిక్య వాణీ సద్వాక్య
పరహిత మది చిత్ర పావన చరిత్ర
ఉభయ విద్యాధుర్య ఉద్యోగధుర్య
వివిధ సద్గుణధామ విభవాభిరామ
జయీ భవా దిగ్విజయీ భవా



'సోషల్' స్టాకర్స్

చూస్తున్నారు జాగ్రత్త..!

దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో ప్రధానమైన సమస్య వ్యక్తిగత భద్రత. ఆన్‌లైన్ ప్రపంచంలో అస్సలు భద్రత లేదు. ఇక్కడ మనిషి వేసే ప్రతి అడుగు ఆలోచించే వేయాలి. అలా ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఇంటర్‌నెట్ ప్రపంచంలో తిరుగుతున్నా ప్రభుత్వాలే పౌరుల భద్రతను బజారులో పెట్టిన సందర్భాలూ ఉన్నాయి. వ్యక్తిగత సమాచారం.. అనేక ఆన్‌లైన్ సేవలకు, ప్రచారాలకు చాలా అవసరం. కేవలం సేవలు, ప్రచారాలకు పరిమితమకుండా వాటిలోని వివరాల ఆధారంగా వేధింపులకు గురిచేసే వ్యక్తులు, ముఠాలు ఉన్నాయి. హ్యాకర్ల ప్రమాదం ఎలానూ ఉంది. ఆన్‌లైన్ స్టాకర్ల బెడద కూడా ఉంది. సామాజిక మాధ్యమాల్లో మీరేం చేస్తున్నా మిమ్మల్ని వెంటాడుతూ ఉంటారు. అంతర్జాలంలోంచి నేరుగా ఇంటి ఎదురుకే వచ్చి గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తారు.

ఈ మధ్య కొన్ని వివాదాస్పద వ్యవహారాల్లో ప్రభుత్వాలు తమ స్వార్థ ప్రయోజనాలకు దేశ పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని వాడుకోవడం చూశాం. ఆధార్ వంటి సైబర్ భద్రత విషయాలపై పెద్ద చర్చే నడుస్తోంది. అమెరికా వంటి దేశాల్లో ప్రభుత్వాలే పౌరులపై ఇలా కన్నేసి ఉంచడంపై పెద్ద వివాదమే అయ్యింది. అగ్రదేశాలు తమ దేశప్రజలే కాదు, మిగతా ప్రపంచంలోని వారిపై కూడా నిఘా పేరు చెప్పి చాలా వ్యక్తిగత సమాచారాల్ని సంగ్రహిస్తున్నాయి. ఇదీ ఓ రకం సైబర్ యుద్ధమే. ఓ వ్యక్తి దినచర్య దగ్గర నుంచి తరచూ వెళ్లే ప్రదేశాలు, తినే తిండి, చేసుకునే వినోదాలు... ఇలా ప్రతి విషయంపై కన్నేసి ఉంచే వ్యవస్థలున్నాయి. వీటన్నింటినీ ఆన్‌లైన్ తేలిక చేసింది. మన ఫోన్‌లోని గ్లోబల్ నేవిగేషన్ వ్యవస్థల ద్వారానే మన నడకల్ని, నడతల్ని తెలుసుకుంటోన్న ముఠాలున్నాయి. ఇదంతా పైస్థాయిలో జరుగుతోన్నదైతే... సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటూ వ్యక్తుల్ని వెంటాడుతూ భద్రతని ప్రమాదంలో పడేసే చర్యలకు దిగుతున్నవారున్నారు.

టార్గెట్ ఆమె

ఓ యువతి నడిరోడ్డులో కామెంట్స్‌ని, కాలేజ్‌లో ర్యాగింగ్‌ను, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుల్లో ఎదురయ్యే చేష్టలతో పాటు ఇప్పుడు ఇంటర్‌నెట్‌లోనూ వేదింపుల్ని తప్పించుకోవాలి. విదేశాల్లో ఎదుటి వ్యక్తిని ఎక్కువసేపు అదేపనిగా చూసినా, గమనించినా, వెంటపడినా స్టాకర్‌గా గుర్తిస్తారు. ఇలా చేస్తే చాలా దేశాల్లో నేరం కూడా. అదే సామాజిక మాధ్యమాల్లో ఇతర ఇంటర్‌నెట్ వ్యవహారాల్లో వెంటాడి వేధిస్తే సైబర్ స్టాకర్ అంటారు. దీనికీ శిక్షలున్నాయి. ఇలా ఒక ప్రదేశం కాదు ప్రతి చోటకు ఈ వేధింపుగాళ్లు బయలుదేరారు. వెంట పడుతారు, ఫాలో అవుతారు, వీలు చూసుకుని అభ్యంతరకర విధానాలతో అటకాయిస్తారు. ఒక మహిళా ప్రొఫైల్ ఉంటే చాలు ఆమెకు నీచంగా మెసేజెస్ చేయడం, ఆమె పెట్టె పోస్ట్‌లకు వికృతమైన కామెంట్స్ చేయడం.. వంటి పనులతో స్త్రీని ఇక్కడ కూడా వదలడం లేదు. ఆమె వ్యక్తిగత ఫోన్ నెంబర్ హ్యాక్ చేసి వివిధ సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసి వేధిస్తారు. ఇలా ఇంటర్‌నెట్ ఆధారంతో చేసే కొన్ని రకాల కాల్స్‌ను ట్రేస్ చేయడమూ కష్టమే. అలాంటి రూట్లను కనుక్కొని యువతుల్ని వేధిస్తోన్న ముఠాలున్నాయి. ఎన్ని ఫోన్ నెంబర్లు ఆన్‌లైన్ ఖాతాలు మార్చినా పదేపదే సైబర్‌స్టాకర్లు వెంటాడుతుంటారు. బెదిరిస్తుంటారు. ఇలాంటి వారి వల్ల మానసికంగా కుంగిపోయిన వ్యక్తులు ఏమి చేయాలన్నా భయపడతారు. అనేక మార్గాల్లో వ్యక్తుల ఇంటి నెంబర్ వంటి కీలక వ్యక్తిగత సమాచారాన్ని చేజిక్కుంచుకుంటారు. అంటే.. హ్యాకర్ల ప్రపంచంలో అంతా బహిరంగమే. వీళ్ల టార్గెట్ ఎక్కువగా యువతులే. వాళ్లు పోస్ట్ చేసిన ఫోటోలను మార్ఫ్ చేసి అన్ని సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తున్నారు. లేదా ఆ వివరాలు, ఫొటోలతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి ఐడెంటిటీ థెఫ్ట్ చేస్తున్నారు. అంటే... డిజిటల్‌గా మిమ్మల్ని మీ అస్తిత్వాన్ని చోరీ చేస్తున్నారు.

భయం వద్దు

సెక్షన్ 354(D) ప్రకారం ఎవరైన ఒక స్త్రీని



ఫేక్ ప్రొఫైల్ ఉన్నాయేమో చూసుకుంటూ ఉండాలి. చాలామంది మన మీద వ్యక్తిగత కోపం, ద్వేషంతో మన ఫోటోలు ఉపయోగించి ఫేక్ ప్రొఫైల్స్ తయారు చేసి అసాంఘిక కార్యక్రమాలు చేస్తూ ఉండవచ్చు. చాట్ చేసేప్పుడు పూర్తిగా తెలిసిన వ్యక్తి అయితేనే ముందుకెళ్లాలి. కామెంట్‌లు ఇబ్బందికరంగాను అదేపనిగాను పెడుతుంటే... జాగ్రత్తపడాలి. మీ మ్యుచువల్ ఫ్రెండ్ రూపంలో స్టాకర్లు చొరబడేందుకు ప్రయత్నిస్తారు. ఆ తర్వాత మీ క్లోజ్‌ఫ్రెండ్స్, ఫ్యామిలీ ప్రొఫైల్స్‌ని తెలుసుకుని వారికీ ఇబ్బంది కలిగిస్తారు. మీ గురించి తప్పుడు సమాచారాన్ని అందిస్తూ మిమ్మల్ని ఒంటరిచేస్తారు. ఆన్‌లైన్ ఈవెంట్‌ల రూపంలో మీరు ఏ రోజు ఏం చేయాలనేది ఫిక్స్ చేసి ట్రాప్‌లోకి లాగే ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఆన్‌లైన్‌లో ఈవెంట్‌ల ఆహ్వానాల విషయంలో

ట్యాగ్‌లతో జాగ్రత్త

ఫోన్ కాల్స్, మెసేజెస్, లేదా ఇతర ఏ రకంగానైన వేధించిన అది stalking కిందికి వస్తుంది. వారు శిక్షకు అర్హులు అవుతారు. మొదటిసారి అయితే మూడు సంవత్సరాలు రెండవ సారి అయితే ఐదు సంవత్సరాలు ఇలా చేస్తూనే ఉంటే కఠిన శిక్షలు పడతాయి. అందుకే మీకు కూడా ఇలాంటి సమస్య ఉన్నట్లు అయితే భయపడి పారిపోకండి. చట్టానికి పట్టించండి. అప్పుడే సమాజం మారుతుంది. మిమ్మల్ని చంపుతామని లేదా మీ ఫోటోలు నగ్నంగా తీశామని వాటిని సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తామని బెదిరింపు కాల్స్, మెసేజెస్ వచ్చిన కూడా వెంటనే సంబంధిత సైబర్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ నమోదు చేయాలి. సంబంధిత ఫోన్ నంబర్స్, మెసేజెస్ పోలీసులకి అందిస్తే వారిపై చర్యలు తీసుకుంటారు.



కట్టు కథలెన్నో...

మీకు ఇష్టం లేకపోయినా పదే పదే ఫోన్ చేసినా, మెసేజెస్ చేసినా, మీతో ఫోనులో అసభ్యంగా మాట్లాడినా వెంటనే ఆ నంబర్స్ నోట్ చేసుకొని పోలీసులకి అందించాలి. 'నేను అనాథను నాకు చదువుకోడానికి డబ్బు సహాయం చేయండి లేదా ఒంటరి మహిళను బ్రతకడానికి డబ్బులు ఇవ్వండి' ఇలాంటి సవాలక్ష కట్టుకథలతో మిమ్మల్ని మోసం చేసే అవకాశం ఉంటుంది. దేనిని కూడా త్వరగా నమ్మరాదు. ఆలోచించి మీకు తెలియకపోతే తెలిసినవారిని సంప్రదించి అప్పుడే ముందుకు అడుగు వేయాలి. ఇలా సామాజిక మాధ్యమాలలో

ఈ ఆన్‌లైన్ స్టాకర్లు చాలా రకాలుగా ఉంటారు. కొందరూ వ్యక్తులను వేధిస్తే మరికొందరూ సంస్థలను వేధిస్తారు. మరి వీరి నుండి తప్పించుకోవడం ఎలా..? వారి ప్రొఫైల్ పిక్‌ని గూగుల్‌లో సెర్చ్ చేయండి. అప్పుడు అదే ప్రొఫైల్ పిక్‌తో చాలా ప్రొఫైల్స్ ఓపెన్ అయితే అది ఫేక్ ప్రొఫైల్ కావొచ్చు. అలాగే వారి టైంలైన్ చూడండి వారి మిత్రులతో లేదా కుటుంబంతో కూడిన ఫోటోలు లేకపోయినా అది ఫేక్ ప్రొఫైల్ అని అంచనా వేసుకోవచ్చు. ఫ్రెండ్స్ లిస్టుని చూసినా కొన్ని అనుమానాలు కలగొచ్చు. సామాజిక మాధ్యమాలలో మీ వ్యక్తిగత వివరాలు అందరికీ కనపడేలా ఉంచుకోకండి. ప్రైవసీ సెట్టింగుల్ని మార్చుకోండి. పబ్లిక్‌లోకి ఏ సమాచారం వెళుతోందో చెక్ చేసుకోండి. ఫొటోలతో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీ మొబైల్ ద్వారా దిగే సెల్ఫీలు, ఫొటోలకు జియో ట్యాగింగ్ ఉండొచ్చు. మెటా డేటాలో చాలా సమాచారం ఉంటుంది. వీటిని పరిశీలించి పోస్ట్ చేసే ముందు ఫొటో వివరాలు మార్చుకోవాలి. ఒకటికి రెండుసార్లు కాదు పాతికపదిసార్లు చెక్ చేసుకునే ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల్ని మన్నించండి. ఎవరినైనా మీరు లిస్టులో యాడ్ చేసుకుంటుంటే వారి టైంలైన్‌ని పరిశీలించి అప్పుడే యాడ్ చేసుకోవాలి. అప్పుడప్పుడు మీ పేరును గూగుల్‌లో సెర్చ్ చేయండి మీ పేరుతో ఏవైనా

మీ నిర్ణయాల్ని పంచుకోకపోవడమే మంచిది. అపరిచిత వ్యక్తుల్ని ఫ్రెండ్‌గా సామాజిక మాధ్యమాల్లో అంగీకరించినపుడు ఆ ప్రొఫైల్ వరకు మీ నుంచి ఏ సమాచారం వరకు వెళ్లాలో సెట్టింగ్ చేసుకోవాలి. ఎక్కువమంది అపరిచితుల్నో, మ్యుచువల్ ఫ్రెండ్స్‌నో కలిగుంటే... మీ దినచర్యలు, వ్యక్తిగత విషయాల్ని ఎక్కువగా పోస్ట్ చేయకపోవడమే మంచిది. క్లోజ్డ్ గ్రూప్‌ల్ని అలాంటి విషయాలకు ఎంచుకుంటే సరిపోతుంది. ఫ్రెండ్స్ నియర్‌బై వంటి కొన్ని ఫీచర్ల వల్ల అనేక సామాజిక మాధ్యమాల్లో దగ్గరలో ఎవరైనా ఆన్‌లైన్ మిత్రుడు ఉంటే తెలిసిపోతోంది. అలాంటి సెట్టింగులతో జాగ్రత్తగా ఉండాలి. ఎప్పటికప్పుడు పాస్‌వర్డ్‌లు మార్చుకోవడం... పూర్తిగా లాగాఫ్ అయిన తర్వాతే గాడ్జెట్‌ను విడిచిపెట్టడం... మొబైల్ ఫోన్లను ఇతరులకు ఇవ్వకుండా జాగ్రత్తపడటం... స్క్రీన్‌లాక్‌లు.. ఇతర పాస్‌వర్డ్‌లతో భద్రం చేసుకోవడం ముఖ్యం. ప్రొఫైల్ హ్యాక్ అయిందని అనుమానం వచ్చినవెంటనే నివృతి చేసుకోవాలి. పర్సనల్ మెసేజ్‌లు అభ్యంతరకరమైనవి ఉంటే వెంటనే వారి ప్రొఫైల్‌ని బ్లాక్ చేసుకోవచ్చు. సంబంధిత సంస్థకు సమస్య తెలియజేయొచ్చు.

వేధించే వారిపై చర్యలు తీసుకోడానికి ఆన్లైన్ లోనే మనం కంప్లైంట్ ఇవ్వచ్చు. దానికోసం అన్ని రాష్ట్రాలలో సైబర్ పోలీసులు ఉన్నారు. సైబర్ చట్టాలు ఉన్నాయి. మన కంప్లైంట్ ని గోప్యంగా ఉంచి సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటారు. నేరం రుజువైతే రెండు నుంచి మూడు సంవత్సరాలు శిక్ష కూడా పడుతుంది. దీనికి సంబంధించి విషయాలపై రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాలి. కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికే సైబర్ నేరాలపై అవగాహనా కల్పిస్తున్నారు. ఇది అంతటా జరిగితేనే అప్పుడే ఇలాంటి నేరాలు తగ్గుముఖం పడతాయి.

- నిజాగ్ని

9700747280

సలాడ్లు, స్నాక్స్, చాక్లెట్స్, ఐస్‌క్రీమ్‌లు, కేక్‌లు ఇలా ఒక్కొక్కరూ ఒకో రకం ఆహారాన్ని ఇష్టపడుతుంటారు. తమకిష్టమైన పదార్థాలతోపాటు వెరైటీ రుచుల్ని ఆస్వాదించే వారంతా ఇప్పుడు వరల్డ్ ఫుడ్ డేను సెలబ్రేట్ చేసేసుకుంటున్నారు. అక్టోబర్ 16 వరల్డ్ ఫుడ్‌డే సందర్భంగా ఆహార పదార్థాలకు సంబంధించి కొన్ని అశ్చర్యపరిచే విషయాలు మీ కోసం.

క్యారెట్ మ్యూజియం

తెలుసా

- పుల్లైసు రుచి తెలీని వారుండరు. ఇంతకీ దీన్ని మొట్టమొదట కనిపెట్టిందెవరో తెలుసా? ఫ్రాంక్ ఎప్పర్‌సన్. శ్యాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన ఎప్పర్సన్ 1905లో ఈ నమూనా ఐస్‌ను కనుగొన్నాడు. అప్పటికి తన వయసు 11 ఏళ్లే.
- 18వ దశాబ్దంలో యూరప్‌లో టమాటాల్ని పాయిజన్ యాపిల్ అని పిలిచేవారు.
- చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లకు మాదిరిగానే క్యారెట్‌లకీ ఓ మ్యూజియం ఉంది. బ్రిటన్‌లో ఉన్న ఆ మ్యూజియం పేరు నేషనల్ క్యారెట్ మ్యూజియం.
- సూప్‌లను తయారుచేయడం క్రీపూ. 6000 లోనే మొదలయ్యింది. అప్పట్లో నీటి ఏనుగు, పిచ్చుకల మాంసంతో సూప్‌ను తయారుచేసేవారు.
- తొలినాళ్ళలో క్యారెట్‌లు ఊదారంగుని కలిగుండేవట.
- ప్రపంచం మొత్తం మీదా అత్యంత ఖరీదైన పీజ్జా ఖరీదెంతో తెలుసా? 12వేల డాలర్లు. ఈ పీజ్జాను తయారుచేయడానికి దాదాపు 72 గంటల సమయం పడుతుందట.
- చాక్లెట్‌లు మయన్లు, అజ్‌టెక్‌ల కాలం ఉంచే అందుబాటులో ఉన్నాయి. అయితే ఆ కాలంలో వీటిని మారకంగా ఎక్కువగా ఉపయోగించేవారట.
- పుట్టగొడుగుల ఉత్పత్తిలో మొట్టమొదటి స్థానంలో ఉన్న దేశం క్యాలిఫోర్నియా. ఆ తర్వాతి స్థానంలో ఉన్న పెన్సిల్వేనియాలోని కెంట్ ప్రాంతానికి మష్రూమ్ క్యాపిటల్ అని పేరు.
- భారతీయ వంటకాల్లో ఎక్కువగా ఉపయోగించే మిరప, టమాటా, బంగాళాదుంప నిజానికి మనదేశానికి చెందినవి కావు. పోర్చుగీసు వారి ద్వారా ఇవి మనకు పరిచయమయ్యాయి.
- విదేశాల్లోనూ భారతీయ రుచులనందించే ఎన్నో ఇండియన్ రెస్టారెంట్‌లున్నాయి. ఇలా విదేశాల్లో భారత్‌కు చెందిన రెస్టారెంట్‌ను మొట్టమొదట ప్రారంభించింది 1810లో. లండన్‌లోని రెజెంట్ స్ట్రీట్‌లో ఏర్పాటుచేసిన ఆ రెస్టారెంట్ పేరు వీరస్వామి రెస్టారెంట్ .
- నిమ్మకాయలు స్ట్రాబెర్రీల కంటే అధిక చక్కెరశాతాన్ని కలిగుంటాయి.
- భారతీయ వంటకాల్లో పచ్చళ్ళు చాలా ఫేమస్.

మన పచ్చళ్ళు బ్రిటీష్ వారికీ తెగ నచ్చేశాయట. మన దేశంలో బ్రిటీష్ పాలన కొనసాగిన కాలంలోనే మన మామిడి గుజ్జు పచ్చడి నమూనాతో ఇంగ్లండ్‌లో పచ్చళ్ళ తయారీ మొదలయ్యింది. ఇంతకీ అక్కడ ఆ పచ్చడి పేరేంటో తెలుసా మేజర్ గ్రేస్. ఇప్పటీ ఈ పచ్చడి అక్కడ చాలా ఫేమస్.

- అవకాడొ అన్ని పండ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లను కలిగుంటుంది.
- కీరాదోస దాదాపు 96శాతం నీటిని కలిగుంటుంది.
- నూడుల్స్‌ని మొట్టమొదట కనిపెట్టింది చైనా వాసులే.
- చికెన్ వింగ్స్ కంటే ముందు ఎక్కువ ప్రజాదరణ పొందింది బఫెలో వింగ్సేనట.

అరవిరిసిన అంగ

ఎత్తైన కొండ ప్రాంతాలు, అబ్బురపరిచే కట్టడాలు, జలపాతాలు, సముద్రతీరాలు, ఉద్యానవనాలు ఇలా మన దేశంలో ఎన్నో అందమైన టూరిస్ట్ స్పాట్‌ల గురించి మీరు వినే ఉంటారు. వీటితోపాటు ఇప్పుడు మన దేశంలోని కడియం లాంటి మరికొన్ని పూల మార్కెట్‌లూ టూరిస్ట్ ప్రదేశాలుగా మారుతున్నాయి. స్థానికులతోపాటు విదేశీ యాత్రికులతో అత్యంత రద్దీగా ఉండే ఆ పూలమార్కెట్‌ల గురించి తెలుసుకోండి.

వివర

ఢిల్లీలో అత్యంత రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఘాజీపూర్ పూలమార్కెట్ ఒకటి. దీన్నే ఘాజీపూర్ ఫూల్ మండీ అని పిలుస్తారు. ఉదయం నాలుగింటి నుంచే ఈ మార్కెట్ మొదలవుతుంది. ఢిల్లీకి సమీప ప్రాంతాల నుంచి ట్రక్కుల్లో రకరకాల పూలు ఇక్కడికి వస్తాయి. వాటిని దించి అక్కడున్న షాపులకు చేర్చడానికి దాదాపు గంట సమయం పట్టేస్తుంది. ఇంతకీ అక్కడ ఎన్ని పూల కొట్లుంటాయో తెలుసా? వందకు పైగానే. ఒక్కో పూల కొట్టు ముందు జాజి, మల్లెలు, గులాబీలు, చామంతులు, లిల్లీలు ఇలా రకరకాల పూలను రాసులుగా పోగేసి అమ్ముతుంటారు. రీటెయిల్, హోల్‌సేల్ అమ్మకాలతోపాటు, ఈ వెంట్ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో ఇక్కడి నుంచీ పూలను కొనుగోలుచేస్తుంటారు. సిక్కిం లిల్లీలు, జమ్మూ తులిప్ పూలు ఇక్కడ చాలా ఫేమస్. ఇలా దేశవాళీ పూల రకాలేకాదు. దక్షిణాఫ్రికా, థాయిలాండ్ దేశాల నుంచి కూడా వందల సంఖ్యలో ఇక్కడికి కొన్ని రకాల పూలు దిగుమతి అవుతుంటాయి. ఢిల్లీ మెట్రో నుంచి ఆనంద విహార్ మెట్రో రైలులో ఇక్కడికి చేరుకోవచ్చు.

ఘాజీ మండీతోపాటు ఢిల్లీలో పేరొందిన మరో పూల మార్కెట్ కన్నాట్ ఫ్లవర్ మార్కెట్. కన్నక్ సింగ్ మార్గ్‌లో ఆన్న ఈ మార్కెట్ ఆసియాలోని అతిపెద్ద పూల మార్కెట్‌లలో ఇది ఒకటి. ఉదయం 4 గం. నుంచి మొదలయ్యే ఈ మార్కెట్ 9 గం వరకూ తెరిచుంటుంది. బెంగళూరు, కలకత్తా, సిక్కిం, మహారాష్ట్ర నుంచి వచ్చే స్థానిక పూల రకాల కంటే విదేశీ పూలకు ఈ మార్కెట్ చాలా ఫేమస్. బొకేల తయారీలో ఉపయోగించే యాంటూరిమ్స్, ఐరిసెస్, గెర్బరాస్ ఇలా వివిధ రకాల పూలను చైనా, థాయిల్యాండ్, దక్షిణాఫ్రికా దేశాల నుంచి ఇక్కడికి దిగుమతి అవుతుంటాయి. చిన్న స్థాయి ఫంక్షన్ల నుంచి పెద్ద పెద్ద ఈవెంట్ల వరకు అలంకరణ కోసం ఉపయోగించే అన్ని రకాల పూలు, ఆకులు ఇక్కడ దొరుకుతాయి. విదేశీ రకాల పూలను పేపర్ బ్యాగ్‌ల్లో ఉంచి అమ్ముతుంటారు. అందమైన బొకేలు, వేలాది రకాల హైబ్రిడ్ పూల రకాల్ని కొన్ని వరుసల్లో అందంగా ఉంచుతారు. ఇలా వందలాది పూల దృశ్యాలన్నీ సందర్శకుల్ని చూపుతిప్పుకోకుండా చేస్తాయి. ఇక ఇక్కడికి అర కిలో మీటరు దూరం వరకు ఈ పూల సువాసనలు వెదజల్లుతుంటాయి. రోజుకు దాదాపు 250 కోట్ల వర్తకం ఇక్కడ జరుగుతుంటుంది.

రైతులే అమ్ముతారు

బెంగుళూరులో పేరొందిన పూల మార్కెట్ హవీనా మండీ, దీనికే ఆర్.కె ఫ్లవర్ మార్కెట్ అని పేరు. బెంగుళూరు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఎంతోమంది రైతు ఈ మార్కెట్‌లో పూలను విక్రయిస్తుంటారు. ఇక్కడ దాదాపు 150కి పైగా పూలను విక్రయించే షాపులుంటాయి. కొన్ని వరుసల్లో మల్లెలు, చామంతులు, ముద్దబంతి పూలు ఇలా రకరకాల విడిపూలను అమ్ముతుంటారు. మరో వరుసలో మాలలుగా కట్టిన పూలను అమ్ముతారు. వివిధ రంగుల చేమంతులు, గులాబీలతో అందమైన మాలలు కట్టి కొందరు షాపుల ముందు వేలాడతీస్తే మరికొందరు బుట్టలో గుండ్రంగా చుట్టి ఉంచి అమ్ముతారు. వివిధ రకాల తాజా పూలతోపాటు రంగురంగుల పూలమాలలకు ఈ మార్కెట్ చాలా ఫేమస్. దీనికి పూలమాలలు కట్టే వారి నైపుణ్యమే కారణం. ఎక్కువశాతం ఇక్కడ పూలను విక్రయించేది రైతులే కావడంతో దళారీలతో ఇక్కడ పనుండదు. రాత్రి 2గంటల నుంచే ఇక్కడ అమ్మకాలు మొదలవుతాయి. ఉదయం 8గంటలతో ఇక్కడ అమ్మకాలు పూర్తవుతాయి.

పూల గల్లీలు

ముంబయ్‌లో దాదర్ ఫూల్ గల్లీ పేరొందిన పూల మార్కెట్. దాదర్ స్టేషన్ నుంచి బైటికి అడుగేస్తే దాదర్ ఫ్లైఓవర్ కనిపిస్తుంది. దాని కిందే ఈ మార్కెట్ ఉంటుంది. లోపల చాలా ఇరుకైన మార్గాలుంటాయి. ఉదయం 6 గం నుంచే మొదలయ్యే ఈ మార్కెట్‌లో

పన్నెండుకుపైగా చామంతి రకాలు, మల్లెలు, ముద్దబంతి పూలు, గులాబీలు వెదురు బుట్టల్లో పోసి అమ్ముతుంటారు. నాసిక్, పూనె ప్రాంతాల నుంచి ఇక్కడికి రకరకాల పూలను తీసుకొచ్చి అమ్ముతుంటారు. ప్రత్యేకించి గులాబీ రకాలకు ఈ మార్కెట్ చాలా ఫేమస్. ఎరుపు, తెలుపు, నారింజ, పసుపు, గులాబి రంగుల్లో ఉండే హైబ్రిడ్ గులాబీల్ని ఒక గుత్తిగా చేసి లేదా ఐదారు పూలను ఒక పేపర్ కవర్‌లో చుట్టి విక్రయిస్తుంటారు. అన్ని రకరాల గులాబీలతో పాటు హైబ్రీడ్ గులాబీలు ఇక్కడ ఎక్కువగా దొరుకుతాయి. మొత్తంగా ఈ మార్కెట్‌లో గులాబీ పూల గల్లీలే ఎక్కువ.

ముల్కి ఘాట్

కోల్‌కతాలో పూల విక్రయాలకు పేరొందిన మార్కెట్ హౌరా బ్రిడ్జి దిగువన ఉన్న ముల్కి ఘాట్. గంగా నదికి అతి సమీపంలోనే ఉంటుంది ఈ మార్కెట్. నదీ ప్రవాహానికి సమీపంగా ఉండే ఊళ్ళలోని పూదోటల నుంచి ఇక్కడికి పూలను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఉదయం ఐదు గంటలకే ఈ మార్కెట్ మెదలవుతుంది. ఇక్కడ ఎక్కువగా ముద్దబంతుల్ని మాలగా గుచ్చి అమ్ముతారు. ఎరుపు, పసుపు, నారింజ రంగుల్లో ఉండే మాలలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ముద్దబంతి దండల్ని కొందరు భుజాలకు తగిలించుకుని తిరుతూ అమ్మే దృశ్యాలు ఇక్కడ కనిపిస్తాయి. పండుగల సమయంలో ఈ మార్కెట్ మరింత రద్దీగా మారుతుంది. కేవలం పూలను కొనే వారేకాదు గంగానదీ తీరాన ఉన్న ఈ పూలమార్కెట్‌కు వీక్షకులూ ఎక్కువే. అలా ఉదయాన్నే చల్లని పిల్లగాలులతోపాటు పూల సువాసనల్ని ఆస్వాదిస్తూ రంగురంగుల పూలను తమ కెమెరాల్లో బంధించేస్తుంటారు యాత్రికులంతా.

తేలియాడే మార్కెట్

కాశ్మీర్ దాల్ లేక్ షికారాలకు చాలా ఫేమస్. దాల్ సరస్సులో షికారాల్లో విహారం చేసేవారిని ఇక్కడి సబ్జీ– ఫూల్ మార్టెట్‌లు మరింతగా ఆకర్షిస్తాయి. ఇక్కడ పూలు, కూరగాయల్ని పడవలపైనే అమ్ముతుంటారు. దాల్ సరస్సులోని బులీవాడ్ నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల వరకు ఈ మార్కెట్ ఉంటుంది. ఉదయం నాలుగు గంటల నుంచి ఆరుగంటల వరకు ఈ అమ్మకాలు ఉంటాయి. తామరలు, తులిప్‌లతో పాటు 40కి పైగా రకాల పూలను ఇక్కడ బోట్లలో అమ్ముతుంటారు. శ్రీనగర్‌లోని వివిధ ఉద్యానవనాల్లో ఈ మార్కెట్ కోసం వివిధ రకాల పూల మొక్కల్ని పెంచుతున్నారు. శాఫ్రన్, తెలుపు రంగులో ఉండే యాపిల్ పూలతోపాటు చామంతుల్ని పోలిన కొన్ని రకరకాల పూలను ఇక్కడ ఎక్కువగా అమ్ముతారు. కాశ్మీర్‌కు వచ్చే టూరిస్టులకు ఈ ఫూల్ మార్కెట్‌లు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇలా చిన్న చిన్న పడవల్లో పూలను అమ్మడం మనకు దాల్ సరస్సులో తప్ప ఇంకెక్కడా కనిపించదేమో.

– అద్దేపల్లి శర్వాణి



కొత్త రాజధాని

కథ

- ఆత్మకూరు కామయ్య
7893129272

రెండు వేల పద్దెనిమిదిలో ప్రభంజనరావు మిత్రుడు సుధాకరరావు "ఏమోయ్! ఇంట్లో కూర్చొని ఎంతసేపూ పుస్తకాలు చదువుకోవడమేనా? కొత్త రాజధాని ప్రాంతంలో అలా అలా తిరిగేసి వద్దాం! రెడీ అవ్వు! అన్నాడు ఆర్డరేసినట్టుగా!

ఎవరి ఖర్చులకు వాళ్ళు కొంత డబ్బులు సర్దుకున్నారు. ఇంకా అవసరమైతే ఏటీయం కార్డులు ఉండనే ఉన్నాయి.

"అవును! అప్పుడెప్పుడో డీమానిటైజేషన్ కొట్టిన దెబ్బతో ఏటీయంలో డబ్బులుండటం లేదంటున్నారు. అక్కడికి వెళ్ళి ఇబ్బంది పడతామేమో ఆలోచించు!" అన్నాడు ప్రభంజనరావు.

"సరే అయితే! చెరొక ఐదేసి వేలు క్యాష్‌గానే తీసుకొని వెళదాం!" అన్నాడు సుధాకరరావు.

"ఏ రోజు క్షేమసమాచారాలు ఆ రోజే తెలియజేస్తుండాలి ఇళ్ళకు" ఇది ఆ ఇద్దరిసతీమణుల ఆదేశం.

ఒక రోజున ముందుగా అనుకున్న ప్రకారం

ఒంగోలులో జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కారు. విజయవాడలో మధ్యాహ్నం రెండున్నర గంటలకు దిగారు. స్టేషన్లోని క్యాంటిన్లోనే భోజనం చేశారు. సంచులు వీపులకు తగిలించుకొని పాదయాత్ర ప్రారంభించారు.

ఆ రాత్రికి తాడేపల్లికి చేరారు. ఒక పాఠశాల కాపలాదారుని బ్రతిమలాడుకొని అక్కడే నిద్రించాలనుకున్నారు. సదరు కాపాలాదారుడు వీళ్ళ సంచుల్ని బాగా శోధించాడు. ప్యాంటు జేబులు కూడా వెతికాడు. నాటుబాంబులు కానీ, పిస్తోళ్ళు కానీ లేవని నిర్ధారించుకున్నాడు.

"రాజధాని ప్రాంతం కదా! ఖర్చులు కాస్త కాస్ట్లీగానే ఉంటాయి. చెరొక యాభైనోటు కొట్టండి. నా మొహాన కాదు మర్యాదగా నా చేతిలో!"

అన్నాడు కాపలాదారుడు. ఇవ్వక తప్పుకునే వీల్లేదయ్యో!

ఆ ఫార్మాలిటీ అయిపోయిన తర్వాత ఆ ఊళ్ళో దొరికిన పుల్కాలు, ఇడ్లీలు తిన్నారు. కాపలాదారుడు చూపిన తావున దుప్పట్లు పరుచుకుని నిశ్శబ్దంగా కళ్ళుమూసుకున్నారు. కాసేపటికి దోమలు దండయాత్ర ప్రారంభించాయి. దోమలపై దండయాత్ర ప్రభావం ఏమి కన్పించలేదే అనుకున్నారు.

ఆ రేయి అలా తెల్లారింది. కాపలాదారు చూపిన పాయిఖానిలో 'ఆపని' కానిచ్చారు. అతడు చూపిన కొళాయి కిందనే అభ్యంగన స్నానాలు చేశారు. మొదటనే వెలగపూడికి పోతే సెక్యూరిటీల అడ్డంకులూ, అరెస్టులూ ఉండొచ్చుననుకొని హైవేకి తూర్పు దిశగా పయనించారు. నడిచి నడిచి ఉదయం పదింటికి ఒక గ్రామానికి చేరుకున్నారు. అక్కడొక కమ్యూనిటీ హాలు కనిపించింది. దానికి దక్షిణ దిక్కున ఉన్న వేపచెట్టు బాగా పండ్లుకాచి ఉంది. ఉత్తరంగా ఉన్న వేపచెట్టుకు కాయలే లేవు.

"ఒకే రుతువులో ఒకేజాతి చెట్లులో ఒకటి పండ్లు కాచేసింది. ఇంకొకటి ఏమీ కాయలేదు. వేపచెట్లది పరపరాగ సంపర్కమా? స్వపరాగ సంపర్కమా?" అడిగాడు సుధాకరరావు ప్రభంజనరావుని.

"ఏమో నాకేం తెలుసు! నేను వృక్ష శాస్త్రం చదవలేదు" అన్నాడు ప్రభంజనరావు. వాళ్ళు అలా మాట్లాడుకునే ముందు ఆ హాలు వరండాలో పడుతున్న వేపచెట్టు నీడలో కూర్చుని వెంటతెచ్చుకున్న టిఫిన్ పొట్లాలు విప్పి ఆరగించారు. ఆ రోజుటి న్యూస్ పేపర్లు క్షుణ్ణంగా చదివేశారు. టైం పదకొండు గంటలైంది. ఒక పెద్దాయన రోడ్డు మీద నడుస్తూ నడుస్తూ వీళ్ళను చూసి దగ్గరగా వచ్చి "నమస్కారాలండీ" అని కుడిచేత్తో ఒంటి చేతి దండం పెట్టాడు. 'ఇద్దరికీ ఇదే సరిపెట్టుకోండి' అన్నట్లు! అతని రెండో చేతిలో ఊతకర్ర ఉంది. వయసు ఎనభై పైనే ఉంటుందనుకున్నారు. "పెద్దాయన గదా! ఎడమచేతిలో ఊతకర్ర ఉంది ఎవర్నైనా ఆ కర్రతో కొట్టి విజయవాడ దాటించగలడు" అన్నాడు సుధాకరరావు.

"నాయన్లారా! మీదేవూరు? మా ఊరికి ఎందుకొచ్చారు.?" అడిగాడు పెద్దాయన.

"పెద్దయ్యానా తమరి పేరేమిటి? అడిగాడు ప్రభంజనం."

"నా పేరు సుబ్బారావండీ! పందొమ్మిది వందల అరవైల్లో 'పాలేరు' నాటకం వంద ప్రదర్శనలిచ్చామండీ మేము" అన్నాడు సుబ్బారావు. వెంటనే అందుకొని ఐదు నిమిషాలపాటు ఆగకుండా ఒక డైలాగు చెప్పాడు.

"పెద్దయ్యా! ఉద్దండుడివే! ఆ రోజుల్లో ప్రజా ఉద్యమాలేమైనా చేశావా?" అడిగాడు సుధాకరావు.

"అయ్యా! నేను మీకు ఉద్యమకారుడిలాగా కనిపిస్తున్నానా? నేను ఏ ఉద్యమాలు చెయ్యలేదండీ! మీరు అడిగారు కాబట్టి ఆ రోజుల్లో ఈ ఊళ్ళో జరిగిన కూలి పోరాటం గురించి చెప్తానండీ! అప్పుడే పన్నెండు గంటలయింది. ఈ ఊళ్ళో భోజన హోటళ్ళు లేవండీ! మా ఇంటికి రండి!

ఇంట్లో ఉండేది నేను నాభార్యే ! మేం దినేది జొన్నసంగటి! అయినా మీకు సోంబువ్వే పెడతాం! మేం మాదిగలమండీ! మీకబ్బెంతరం లేకపోతే మా ఇంట్లో నాలుగు రోజులుండండీ! ఆకలవ్వటంలేదా? రండీ! బువ్వదిన్నాక ఆ కూలీ పోరాటం గురించి యివరంగా చెప్తానండీ!" అని సుబ్బారావు వాళ్ళని తన ఇంటికి తీసుకెళ్తున్నాడు. దార్లో ఎవడో ఎదురొచ్చాడు.

"ఎవళ్ళాళ్ళు? ఊరిక్కొత్తోళ్ళా లాగుండారే! పొలాలు కొండానికికొచ్చారా? కేయ్ ముసలోడా! దళారి పనులుగూడా సేత్తాన్నావా? ఏంటి", అన్నాడతను.

"ఎడంకాలి సెప్పుతో గొట్టాల్రా నిన్ను! ఈళ్ళు మా అన్నగారి అల్లుడుగార్లు! రాజధానంతా సూడ్డానికొచ్చారంటా! నీకేమైనా అబ్బెంతరమా!" అన్నాడు సుబ్బారావు.

"నాకబ్బెంతరమేలా నాల్డబ్బులు సంపాదించుకో బిడ్డల్లేనోడివి!" అంటూ సుబ్బారావు విసిరిన చెప్పుకు అందకుండా దౌడుతీశాడతను. ముగ్గురూ సుబ్బారావింటికి చేరారు. ఇటుకలతో కట్టిన రెండు గదులిల్లు పైన తాటాకుల కప్పు. ఇంట్లోకి దూరడానికొక వాకిలి. స్నానాలదొడ్డి మీదగా గోడెక్కిపారి పోడానికొక వాకిలి, పేడనీళ్ళతో అలికిన ఫ్లోరింగు.

సుబ్బారావు రెండు నులకమంచాలు వాల్చి వాటిపై దుప్పట్లు పరిచాడు. సుబ్బారావు సోమిబువ్వ రెడీ చెయ్యమని భార్యతో చెప్పడానికి దొడ్లోకెల్లాడు.

మళ్ళీ వొచ్చి రెండు మంచాలకూ రెండు తలగడలు అమర్చాడు. "బాబులూ! ఓ గంటపాటు ఇశ్రాంతి తీసుకోండి బువ్వ రెడీ కాగానే నిదర్లేప్తాను" అన్నాడు.

"ఈ ఊళ్ళో దోమలపై దండయాత్ర చెయ్యలేదా? అడిగాడు సుధాకరరావు.

"మొదట దండయాత్ర చెయ్యాలనుకున్నారంటండీ? ఆ పైన కేంద్రంలో అధికార అధిష్ఠానం 'దోమల్ని చంపకండీ. అది జీవహింస!" అని అన్నారంటండీ అందుకని ఆ కార్యక్రమం ఆగిపోయిందండీ? అంటూ నవ్వాడు. సుబ్బారావు అబద్ధం చెప్పినందుకు

" ఆ కూలి పోరాటం గుర్చి చెప్పండి పెద్దయ్యా! మళ్ళీ రేపట్నుంచి మేము చాలా ఊళ్ళు తిరగాలిగదండీ! నాల్రోజులు మీ ఇంట్లోనే ఉంటే ఎవరో కొత్తోళ్ళు సుబ్బారావింటికొచ్చినారని పోలీసులొచ్చి మమ్మల్నీ నిన్ను అరెస్టు చేస్తారేమో?" అన్నాడు ప్రభంజనం.

"పోలీసులీతట్టుకి రారు! వాళ్ళ ప్రతాపమంతా పొలాలివ్వని రైతుల మీదనే లేవండీ భోంచేద్దురుగాని" అని అన్నాడు సుబ్బారావు. ఆ కార్యక్రమం పూర్తయింది.

వాళ్ళిద్దరికీ తాను కూర్చున్న కుక్కి మంచాన్ని వాళ్ళకు దగ్గరగా లాక్కున్నాడు. తలపైన ఒకసారి కుడిచేత్తో తట్టుకుని చెప్పడం మొదలుపెట్టాడు.

"మీరనుకున్నట్టు ఇది కథ కాదు. చరిత్ర! భారతదేశంలో ఇటువంటి చిన్న చిన్న పోరాటాలు చాలినే జరుగుతుంటాయి. "ఇతిహాసపు చీకటి కోణంలో అట్టడుగున పడి కనిపించని కథలన్నీ కావాలిప్పుడు" శ్రీశ్రీగారు రాశారట! మీరొచ్చిన దార్లో రోడ్డుకు రెండు పక్కలా ఎత్తయినా అపార్టుమెంట్లు ఆకాశంవైపుకు దూసుకుని పోతున్నాయి. చూశారా రాకెట్ మిషన్లలాగా! ఆ భూములన్నీ ఆ రోజుల్లో పదిమంది భూస్వాములవే! వాటి మధ్యలో తమ పోరాటాలకు ఇంకా మంచి ధరలొస్తాయని చిన్న చిన్న రైతులు అమ్ముకోలేదు. అమ్ముకుని సొమ్ము చేసుకున్న వాళ్ళు వాటాలు కుదరక ఒకర్నొకరు చంపుకుంటున్నారు. ఆ రోజుల్లో ఆ భూస్వాములు, కొందరు వరిపైరు నాటేవారు. కొందరు మొక్కజొన్న, అరటి, కందగడ్డ, అలాంటి పైర్లు వేస్తుండేవారు. ఐదేసి వందల ఎకరాలుండే భూస్వాములు నాగలి మేడి పట్టి పొలాలు దున్నుతారా? నారు వేతలు వేస్తారా? అన్ని పనులకూ భూములులేని కూలీలనే వాడుకుంటుండే వాళ్ళు వస్తువుల్ని వాడుకుంటున్నట్లుగానే! పక్కన పదిమైళ్ళ దూరంలోనే బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుండేది. ఎక్కడ బోరు వేసినా కృష్ణమ్మ చలవతో భూగర్భ జలాలు గంగవెల్లువెత్తినట్టుగా గంతులేసేది.

భూస్వాములు బాగా బలిసిపొయ్యిండేవారు. ఒక్కొక్కరికీ ఇంటిముంగిట వడ్లకూట్లు వేల పాతరలు, ఎడ్లకోసం, గేదెలకోసం దున్నలకోసం, ఆవులకోసం, అన్ని రకాల దూడలకోసం అరకిలో మీటరు పొడవునా పావుకిలో మీటరు వెడల్పున పనులు కొట్టాలుండేవి.

ప్రతి భూస్వామికి ఇంటి పనులు, బయట పనులు చేసేటందుకు ఓ యాభై మంది మొగాళ్ళు యాభై మంది ఆడాళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళకి సంవత్సారానికిన్నని తగ్గురకం వొడ్లు కొలిచేవాళ్ళు. అడుగులు లోపటికి తట్టినా ఇనప కుంచాలతో లొంగితే ఆడాళ్ళని తట్టుకుంటుండేది. మధ్యలో వాళ్ళకేదయినా జబ్బు చేస్తే ఒక రూపాయి బిళ్ళ

వాళ్ళ మొహాన కొట్టి గుంటూరుకు నడిచి పొయ్యి నాటు వైద్యం చేయించుకోమని చెప్పేవారు. భూస్వాములందరూ పతొక్కరోజూ పెళ్ళి భోజనాలు చేసేవాళ్ళు. కొందరైతే రోజుకి మూడు గిద్దల ఆవునెయ్యి తాగేవాళ్ళు.

ఆ రకంగా నెయ్యి తాగి తాగి పొట్టలు పెరిగిపోతే వీధిలో నడిచేటప్పుడు పొట్టలు వొంగక నేరుగా చూస్తూ పోతుండేవాళ్ళు" అంటూ గలగలా నవ్వాడు. మళ్ళీ ఒక డైలాగు ఐదు నిమిషాల పాటు ఆపకుండా లాగించాడు. అతనికి ఆ వయసులో గూడా అలుపు రాలేదు. చుట్టా, బీడి, కల్తీ సారాయిలు, తాగేటోడు గాదంట.

జొన్నసంగటీ, రాగిసంగటీ, వరిగల అన్నం తింటూ ఉండేవాడంట. ఉడికించి ఉప్పుకారం చల్లిన అవిశాకు ముక్కలు రెండు బుగ్గన బెట్టుకుని మూడేసి సంగటీ ముద్దలు లాగించేవాడంట. సుబ్బారావే చెప్పాడంట ఆ సంగతులు వాళ్ళకి. పొలాల్లో పనులు చేసే కూలోళ్ళకి మొగాళ్ళకి రోజుకి రూపాయిన్నర కూలీ. ఆడాళ్ళకి పదణాల కూలీ ఇచ్చే వారు భూస్వాములు. ఆడాళ్ళకిచ్చే కూలి శానా తక్కువని అయ్యల్ని మీరు అడగడం లేదని ఇళ్ళల్లో ఆడాళ్ళు మొగాళ్ళు మీద సమ్మెలు జేస్తుండేవాళ్ళు శానాకాలం నించీ.

మావాడల్లో ఉండే కుర్రాళ్ళు గూడా కుతకుతలాడిపోసాగారు. పక్కఊళ్లోనేమో కిందటేడాదే ఆడాళ్ళు ఆడపులులల్లా మొగాళ్ళు మీదని దూకి తన్నేదాకా వచ్చింది యవ్వారం.

ఇట్టగాదని అందరం మాట్లాడుకొని వరికోతల సమయంలో ఒక భూస్వామి ఇరింటికి పోయినాము. అప్పుడు నాకు ఇరవైయొక్కటో ఇరవైరెండో ఏళ్ళ వయసు. మేం పోయే తలిపి భూస్వామి ఇంట్లో కిటికీ దగ్గర జైల్లో దొంగలాగా కూచొని ఏందో మేస్తా ఉండాడు. నిద్రబొయ్యేటప్పుడు దప్ప తక్కిన సమయమంతా మేసేపనే గదా! భూస్వాములకి!

మావోళ్ళు ఆయనద్దగ్గరికి పోయిన ముందురోజు రాత్రి ఒక కామ్రేడు గారొచ్చినారు. మావూళ్లోకి మా పిలకాయలకి కూలి పోరాటం ఎలా జెయ్యాలో నేర్పాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసులతో తలపడొద్దని చెప్పినాడు. భూస్వాములకు వందడుగుల దూరంలో ఉండి పెద్దగా మాట్లాడమని చెప్పినాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ హింసకు పాల్పడవద్దని చెప్పినారు. పొరుగూళ్ళ కూలీలను బ్రతిమాలుకొని వాళ్ళు తిరిగి వాళ్ళ ఊళ్ళకు వెళ్ళిపోయేటట్లు చెయ్యమన్నాడు. ఆ రాత్రికే ఆయన విజయవాడకు వెళ్ళి పోయాడు. ఆయనకు తోడుగా నలుగురైదుగురు వొచ్చినట్టే గుర్తు.మమ్మల్ని చూచి ఆ భూస్వామి.

"ఏమిటో అందరూ కట్టగట్టుకుని వచ్చినారు. ఏంది సంగతి? అన్నాడు. మేము ఇంట్లోకి దూరతామని ఇంటి తలుపు మూసేయించినాడు. కిటికీలోనించే మాట్లాడ సాగినాడు.

మా తరపున ఒకరు భూస్వామితో మాట్లాడసాగినాడు. "అయ్యా! పోయిన సంవత్సరమే పక్కఊళ్ళో ఆడాళ్ళకి పన్నెండణాల కూలి ఇచ్చినారు. ఈ సంవత్సరమైనా మీరు మా ఆడాళ్ళకు ఆ కూలి ఇవ్వాల! అన్నాడు వెంకటస్వామి.

మావోళ్ళు ఆయనద్దగ్గరికి పోయిన ముందురోజు రాత్రి ఒక కామ్రేడు గారొచ్చినారు. మావూళ్లోకి మా పిలకాయలకి కూలి పోరాటం ఎలా జెయ్యాలో నేర్పాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసులతో తలపడొద్దని చెప్పినాడు. భూస్వాములకు వందడుగుల దూరంలో ఉండి పెద్దగా మాట్లాడమని చెప్పినాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ హింసకు పాల్పడవద్దని చెప్పినారు. పొరుగూళ్ళ కూలీలను బతిమాలుకొని వాళ్ళు తిరిగి వాళ్ళ ఊళ్ళకు వెళ్ళిపోయేటట్లు చెయ్యమన్నాడు.

భూస్వామి కళ్ళు ఎరుపెక్కి కనుగుడ్లు బయటకి రాసాగినాయి. మెడ చుట్టూ పెరిగి ఏలాడుతుండే తోలు తిత్తులు అదరసాగినయ్!! మీసాలు నిక్కబొడుచుకుని ఆంజనేయులు స్వామి తోకలాగా కిటికీలోనించి బయటికొస్తయ్యేమో అనిపించినయ్!

"ఎందుకు పెంచాల్రా కూలి! తరతరాలనించీ మీరు మాకు కట్టుబానిసలు. అది మీ తలరాత మీరు కూలికి రాకపోతే పోలీసుల చేత తన్నిస్తాం! ప్రభుత్వం మాది. గాంధీగారు ఏంజెప్పినారు? భూస్వాముల దగ్గర ఆస్తులుంచుకొని పేదోళ్ళకి అంతముష్ఠి పారెయ్యండని చెప్పినారు. మీకు భయపడి కూలిపెంచేది లేదు. మీరు రాకపోతే ఏమయిద్ది? ఈ దేశంలో కోట్లు కోట్లుగా కూలీనాయాళ్ళుండారు! మీరు పనికి రాలేదని మా వరిచేలు తగల బెట్టుకుంటామా! ఎల్లండెల్లండెహే! ఒరే వాళ్ళందర్నీ ఈదిలోకి నెట్టేసి గేటు తలుపు లేసేయండ్రా! అని తలమనిషికి ఆర్డరేసినాడు భూస్వామి.

ఆళ్ళెవురు? మావోళ్ళేగదా! ఎవురికీ చింతీకంత నెప్పిలేకుండా అందర్నీ వీధిలోకి పంపించి గేటుకి తాళమేసుకున్నారు.

ఆ రాత్రికి మేమంతా సమావేశమైనాము. ఆడా, మొగా అందర్నీ నాలుగు గ్రూపులు చేసినాము. ఒక్కొక్క గెమిట్లో ఒక్కొక్క గ్రూపుని తెల్లారకముందే నిలబెట్టేసినాం. మావాళ్ళు పొయ్యే లోపల్నే పతిగెమిట్లోని పోలీసు వ్యాన్లు దిగేసుండయ్!

"మీకు మాకు విరోధం లేదు. మేం మీతో తలపడం! పొరుగూరి కూలోళ్ళొస్తే వాళ్ళని గూడా ఇట్టనే బతిమాలుకుని వెనక్కి పంపించేస్తాం! దయచూపండి అంటూ పోలీసుల్ని బతిమాలుకున్నారు. మావోళ్ళు ఆ కామ్రేడ్ సార్ చెప్పిన ప్రకారమే!

పక్కఊళ్ళ జనాలు రాసాగారు. వాళ్ళని బతిమాలుకున్నాం. పోలీసులు మమ్మల్ని బెదిరిస్తున్నట్టుగా లాటీలతో చిన్నచిన్న దెబ్బలు వేస్తూ బాగానే నటించారు. ఆ రోజుకి పొరుగూళ్ళ జనం ఎల్లిపోయినారు.

ఆ రకంగా పదిరోజులు జరిగింది మా కూలిపోరాటం. ఊళ్ళోకి అన్నలొచ్చినారని ఓ... ఆగిత్తమై పోయింది. వాళ్ళెక్కడున్నారో ఎవుర్తో మాట్లాడతున్నారో మాకేం తెలీదు. భూస్వాములకి తెలిసిపోయింది. ఎవురైనా పుకార్లు లేవదీసినారో తెలీదు భూస్వాములందరూ రాత్రికి రాత్రే పరారైనారు. ఒక్క భూస్వామి తప్ప. ఆ భూస్వామి వెంకటస్వామిని కొందరాడాళ్ళని పిలిపించి మేము మీ ఆడాళ్ళకి రోజుకి పన్నెండణాల కూలీ ఇస్తాం. పన్లోకి దిగండి" అన్నాడు. అప్పటికైతే ఎవురికీ దెబ్బలులేవు. కొందర్ని మాత్రం అరెస్టు చేసి రిమాండరుకి బంపిచ్చినారు.

అయితే, ఒక పొరపాటు జరిగింది. మా వాళ్ళలో ఇద్దరు తుంటరి పిలకాయలు గుంటూరు నుంచి పెట్రోలు క్యాన్లు తెచ్చి ఒక భూస్వామికి చెందిన నలభై ఎకరాల వరిపొలాన్ని తగలబెట్టి ఊరు విడిచి పారిపోయినారు. ఊళ్లో ఉన్నా పిల్లా జల్లా ముసలి, ముతక అందరూ చుట్టాల పాగీలకి పోయినారు." అని చెప్పి సుబ్బారావు ఆ చరిత్రను ముగించాడు. ఆ మరు నాటి ఉదయాన్నే "పెద్దయ్యా! మేం చాలా ఊళ్ళు తిరగాల గదా! ఇంక వెళతాం" అని చెప్పి ఆయన దగ్గర సెలవు తీసుకుని ఆ ఇద్దరు మిత్రులూ ఆ ఊరు నుంచి నిష్క్రమించారు.

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా ఉండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా ఉండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా ఉండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో ఉం డాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో ఉండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. పేరు, పూర్తి చిరు నామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరు నామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

మారిన సింహం

అడవిలో కనిపించిన జంతువునల్లా చంపితినే సింహం ఒకరోజు ఉన్నట్టుండి కనపడలేదు. మిగతా జంతువులకు దాని బాధ తప్పటంతో ఆనందంతో గంతులేశాయి. ఇష్టం వచ్చినట్లు అడవి మొత్తం కలియతిరిగాయి. పెద్ద జంతువుల తోడు లేకుండా చిన్నవి ఆడుకున్నాయి. అయితే, సాయంత్రానికి అడవిలో ఒక మూల నుంచి మూలుగు వినపడసాగింది. జంతువులన్నీ ఆ దిక్కుకు వెళ్లి చూడగా అక్కడ సింహం ఒక వేటగాడు పన్నిన ఇనుపవలలో చిక్కుకుని విడిపించుకోవటానికి విశ్వప్రయత్నాలు చేస్తుంది.

ప్రయత్నాలు విఫలం కావటంతో శక్తి సన్నగిల్లి మూలగసాగింది. జంతువులకు సింహాన్ని చూడగానే దీనికి తగిన శాస్తి జరిగింది. లేకపోతే కనపడిన జంతువునల్లా చంపి తినేది. ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా కాళ్లపట్టుకున్నా కనికరం చూపలేదు. మన సంతానాన్ని పొట్టన పెట్టుకుంది. ఈరోజుతో దీని బాధ విరగడ అవుతుంది. ఇప్పటి నుండి అడవిలో స్వేచ్ఛగా తిరగొచ్చు అని జంతువులు సంభాషించుకుంటున్నాయి. సింహం కన్నీరు కారుస్తూ జంతువుల వైపు చూస్తూ వాటి మాటలు వింటూ రక్షించమని అడగుదామనుకున్నా పొద్దున నుంచి వలలో చిక్కుకోవటంతో ఆహారం లేక మాట్లాడలేకపోయింది. 'పోనీ ఈ జంతువులను ఇప్పుడు నోరు తెరచి అడిగితే వీరి పిల్లలను చంపాననే కోపంతో రక్షిస్తారో లేదోఅని' మనసులో మౌనంగా మదనపడసాగింది. ఈ వలలో ఉన్న నేనే తప్పించుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను. వీటి పిల్లలు నా నుంచి తప్పించుకోవటానికి ఎంత వేదన అనుభవించాయో! బలగర్వంతో తోటి జంతువులను చంపి పెద్ద తప్పు చేశాను. ప్రాణాలు ఎవరికైనా ఒకటేగా! గతంలో ఎన్ని జంతువులను హతమార్చానో! అని మనసులో అనుకుంది. ఇంతలో అక్కడున్న జంతువులన్నీ సింహాన్ని రక్షించగూడదని తీర్మానించాయి. మనం చేయలేని పనిని వేటగాడు చేస్తున్నాడని సంబరపడ్డాయి. అదే సమయంలో గుంపులోంచి జింక ముందుకొచ్చి పాపం సింహాన్ని చూస్తే జాలేస్తుంది. విడిపిద్దామన్నది. మిగతా జంతువులు జింకతో నీకు బుద్ధుందా నీ బిడ్డను చంపి రెండ్రోజులు కాలేదు. సింహం చావును కళ్లారా చూసి ఆనందించాల్సింది పోయి విడిపిద్దామంటావా అని ఆగ్రహం వ్యక్తం చేశాయి. అప్పుడు జింక 'మీరు చెప్పింది నిజమే. నా బాధను ఎవరూ తీర్చలేరు. బిడ్డను కోల్పోయిన బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. కానీ సింహానికి కూడా రెండు పిల్లలు ఉన్నాయి. తల్లి లేకపోతే అవి ఎంతగా అల్లాడుతాయో మీకు తెలుసా?' అని ప్రశ్నించింది. ఏ జంతువు మాట్లాడక పోవటంతో జింక ఇకనుంచి మనల్నందరినీ చంపనని మాట ఇస్తే రక్షిద్దామంది. జంతువులన్నింటికీ ఇది నచ్చింది. సింహం వైపు చూడగా అది కన్నీరు కారుస్తూ .. మెల్లగా గొంతు విప్పి నీరసంతో 'మీవాళ్లను చంపినా నన్ను కాపాడాలనుకుంటున్నారు. మీకు కృతజ్ఞ తలు. ఇక నుండి ఏ జంతువునూ చంపను. మీకు రక్షణగా నిలబడతాను. నన్ను విడిపిం చండి' అని ప్రాధేయపడింది. అడవి జంతువు లకు సింహం మాటపై గురి కుదర టంతో తప్పించేందుకు అంగీకరించాయి. ఇంతలో దూరంగా వేటగాడు కనబడటంతో జంతువులన్నీ సింహం వలను ఛిద్రం చేశాయి. బతుకుజీవుడా అనుకుంటూ మిగతా జంతువుల తో కలసి అడవిలోకి పరుగు తీసింది సింహం.

- తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర
9492309100

తేడాలు కనిపెట్టండి

పిల్లలూ! ఇక్కడ ఇచ్చిన రెండు బొమ్మల మధ్య పది తేడాలు ఉన్నాయి.
వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.

సున్నా చుట్టేయండి

ఈ చిత్రంలో కొన్ని బొమ్మలు ఇచ్చాం. అయితే, వాటిలో జంతువులు ఎక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టేయండి.

దారితప్పిన పిల్లవాడు

బాల నేస్తాలు

5

పిల్లల సీరియల్



- పి. చంద్రశేఖర ఆజాద్
9246573575

గౌరీకి రాత్రి నిద్ర లేదు.

సుధ ఇంటి నుంచి వెళ్లిపోయాడని అర్థం అయింది. వాడి ఫొటో కూడా లేదు. ఆ మధ్య అందరూ కలిసి తీయించుకున్న ఫొటో వుంది. దాని మధ్య నుండి సుధ ఫొటోని పెద్దది చేయాలి.

ఇప్పటివరకు ఎవరికీ ఈ విషయం చెప్పలేదు.

బాబూరావు పోలీసులకి రిపోర్ట్ చేయాలనుకున్నాడు.

రజని స్కూల్‌కి వెళ్లింది.

మొదటిసారి బాబూరావు షాప్‌ని మూసేశాడు. అతని అమ్మానాన్న మేం బయలుదేరి వస్తున్నాం అన్నారు. గౌరికి అందుకూ బాధగా వుంది.

అత్తయ్య - మావయ్యలకి గౌరి దగ్గర వుండటం ఇష్టం లేదు. ఆమె బద్ధకం గురించి తెలుసు. బాబూరావు ఆమెను ఇష్టపడి పెళ్లి చేసుకున్నాడు. వారికది నచ్చలేదు. క్రమంగా బాబూరావు వ్యాపారాన్ని పెంచుకుంటూ వచ్చాడు. జయంతి పిట్టగోడ దగ్గర నిలబడి గౌరిని పిలిచింది. తను వచ్చింది. గౌరి ముఖం చూడగానే -

ఏంటి వదినగారూ అలా వున్నారేంటి? అంది. జయంతి అప్పటిదాకా అణుచుకున్న దుఃఖం ఆపుకోలేకపోయింది గౌరి. బొట బొటమంటూ కన్నీళ్లు కారిపోతున్నాయి బుగ్గల మీద...

నేను వస్తున్నాను అంటూ ఆమె తలుపుకి తాళం వేసి వచ్చింది.

"మా సుధ నిన్నటి నుంచి కనిపించటం లేదు" అని ఏడ్చేసింది.

"ఊరుకోండి. అసలు ఏం జరిగిందో చెప్పండి" అంది. ఆమె తేరుకున్నాక చెప్పింది.

"మీరు కంగారు పడవద్దు వదినగారూ. సుధ మరీ చిన్నపిల్లవాడు కాదు. రెండు రోజుల్లో తప్పకుండా తిరిగి వస్తాడు. నా మాట నమ్మండి" అంది.

"కొంతమంది పిల్లలు ఇలానూ వుంటారు. మా బంధువుల పిల్లవాడు కూడా ఇలానే వెళ్లిపోయాడు. ఆ తర్వాత తప్పు తెలుసుకున్నాడు. ఇప్పుడు ఇంజనీర్ అవుతున్నాడు" అంది.

గౌరి తలూపింది గాని మనసు మనసులో లేదు. జయంతి వెళ్లిపోయాక ఇంకో ముగ్గురు వచ్చారు.

"ఇలా వెళ్లటం చాలా ప్రమాదం గౌరీ... ఇప్పుడు ఎక్కడ చూసినా పిల్లలను ఎత్తుకుపోయే ముఠాలు వున్నాయి. అవన్నీ వింటుంటే భయం కలుగుతోంది" అంది ఒకావిడ.

ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో ఎంతో జాగ్రత్తగా వుండాలి అనుకున్నారు. వారి మాటలు వింటుంటే గౌరికి ఇంకా భయం కలుగుతోంది. తను ఇంతవరకు వంట చేయలేదు. పిల్లలకు డబ్బులు ఇచ్చి పంపింది బడికి.

వాళ్లు వెళ్లేసరికి జయంతి అన్నం కూరలు తీసుకుని వచ్చింది.

"ఎందుకు వదినగారూ - నేను భోజనం చేయను" అంది.

అలా అనకండి. నీరసం వస్తుంది. నామాట వినండి" అంది

"మా సుధ ఎక్కడ వున్నాడో, ఇంతవరకు ఏమన్నా తిన్నాడో లేదో" అంటున్నప్పుడు మళ్లీ దుఃఖం వచ్చింది.

"తప్పకుండా తింటాడు. నేను మా వారికి చెప్పాను. ఆయన కూడా బాధ పడ్డారు. సుధ అంటే ఆయనకు ఇష్టం. వాడు రాగానే మాట్లాడతాను అన్నారు. ఆయనకి ఓ పోలీస్ ఆఫీసర్ తెలుసు. తన వంతు ప్రయత్నం చేస్తాను అన్నారు. ముందు మీరు అన్నం తినండి" అంటూ లేచి తను పళ్లెం తీసుకు వచ్చింది.

అన్నం - కూరలు కలిపింది. మంచి నీళ్ల అందించింది. బలవంతాన తినిపిస్తుంటే...

"ఈ జయంతినా నేను అవమానించింది" అని గౌరి మనసులో కుళ్లిపోయింది.

◆◆◆

సుధ ఎత్తయిన భవనాలు చూసుకుంటూ నడుస్తున్నాడు. రోడ్డుకి రెండు పక్కలా బస్సులు కార్లు ఆటోలు బైకులు పరుగులు తీస్తున్నాయి. వాటి మధ్య నుండి అవతలకి వెళ్లటం చేస్తుంటే తాను ఏదో సాధించినట్లుగా సంతోష పడుతున్నాడు.

ఓ ఎత్తయిన భవనంలోకి వెళ్లాడు. అక్కడ లిఫ్ట్ కనిపించింది. అందులోకి వెళ్లాడు. రెండుసార్లు పైకి, కిందకు వెళ్లాడు. అక్కడ నుండి నగరంలో కొంత భాగం కనిపిస్తోంది.

"ఇంత పెద్దదా?" అని గుండెల మీద చెయ్యి వేసుకున్నాడు.

అక్కడ షాపుల్ని చూస్తుంటే తమ షాపు ఎంత చిన్నదో అర్థం అయింది. స్టేషన్ నుండి బయటకి వచ్చాక ఆకలి అనిపించింది. ఓ హోటల్ కనిపించింది. అక్కడికి వెళ్లాడు. అక్కడ ఇడ్లీలు కనిపించాయి. తమిళంలో ఏదో అడుగుతున్నారు.

"టిఫిన్ - టిఫిన్" అన్నాడు.

"తెలుంగా... పొంగల్ తిన్నావా?" అన్నాడు.

"తింటాను" అన్నాడు.

అప్పుడు పొంగల్ వేడి వేడిగా వచ్చింది. దానిమీద సాంబార్ పోసారు. ఇంకో పక్క కొబ్బరి పచ్చడి వేసారు. అరటి ఆకు మీద వాటిని చూస్తుంటే నోరూరింది. అయినా ఎలా వుంటుందో అని అనుమానం.

నోట్లో పెట్టుకోగానే ఇంతకు ముందు ఎప్పుడూ కలగని అనుభూతి కలిగింది. ఆబగా తిన్నాడు.

"ఇడ్లీ తిన్నావా?" అని అడిగాడు అతను.

"పొంగల్" అన్నాడు

అతను కళ్ల ఎగరేసి ఇచ్చాడు. కడుపు నిండి పోయింది. మనసు కూడా నిండిపోయింది అనుకున్నాడు.

"కాఫీ" అన్నాడు సర్వర్

"నో కాఫీ" అంటూ డబ్బులు ఇచ్చాడు.

తర్వాత బయటకి వచ్చాడు. అప్పుడు స్నానం చేయలేదు అని గుర్తు వచ్చింది. చెమట వాసన వస్తోంది. ఇంటి నుంచి ఏమీ తీసుకు రాలేదు. వంటి మీదున్న బట్టలు తప్ప చేతిలో చిన్న బ్యాగ్ కూడా లేదు.

ఇప్పుడు రెండు జతల బట్టలు కొనుక్కోవాలి. ఆ తర్వాత రాముని వెతుక్కోవాలి అనుకున్నాడు. అలా నడుస్తుంటే పెద్ద పెద్ద షాపులు. అక్కడ రకరకాల రెడీమేడ్ బట్టలు. తన జేబు చూసుకున్నాడు. అవసరానికి తీసిన డబ్బులు పై జేబులో వున్నాయి. మిగతా డబ్బులు భద్రంగా వున్నాయి.

ఆ తర్వాత ఓ భవనంలోకి వెళ్లాడు.

అక్కడ బట్టలు కూడా వున్నాయి. అక్కడికి వెళ్లాలి అని ముందుకు కదలబోయాడు.

అప్పుడు భుజం మీద చెయ్యి పడింది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు.

(ఇంకా ఉంది)

కోతి కాదు స్లాత్

పిల్లలూ మీరు రకరకాల జంతువుల గురించి తెలుసుకుంటుంటారు కదా! మరి మీకు స్లాత్‌ల గురించి తెలుసా?

◆ఇవి దక్షిణ అమెరికాలోని అడవుల్లో ఎక్కువగా కనిపిస్తాయి.

◆మొత్తం ఆరు జాతులుగా ఉండే స్లాత్‌ల్లో ప్రస్తుతం మనుగడ సాగిస్తోంది రెండు జాతులు మాత్రమే.

◆కోతుల్ని పోలుండే ఈ జంతువు చిన్న ముఖం, లేత బూడిద రంగు బొచ్చును కలిగుంటాయి.

◆ఇవి 60-80 సెం.మీ పొడవు, 7.7 కేజీల బరువును కలిగుంటాయి.

◆ నేలపై కంటే ఇవి ఎక్కువగా చెట్ల కొమ్మలపైనే ఉంటాయి. దాదాపు 8-10 సెం.మీ పొడవాటి గోళ్ళను కలిగుండడంతో ఇవి ఎక్కుగా నేలపై నడవలేవు.

◆ఇవి చిన్న చిన్న కీటకాలతోపాటు చెట్ల ఆకుల్ని ఎక్కువగా ఆహారంగా తీసుకుంటాయి. ఇవి తీసుకునే ఆహారం అరగడానికి చాలా ఎక్కువ సమయం పడుతుంటుంది.

◆ఇవి బలహీన పడేకొద్దీ ఇవి తీసుకునే ఆహారం వికటిస్తుంది. అందుకే ఇవి ఎప్పుడూ కడుపునిండా తినేస్తుంటాయి.

◆ఇవి రోజుమొత్తంలో 15-20 గంటలు నిద్రలోనే గడిపేస్తుంటాయట.

◆వాటి నడక వేగం కంటే మూడు రెట్లు ఎక్కువ వేగంతో ఇవి ఈదగలవు.

◆స్లాత్‌లు మూడు వేళ్ళతోపాటు ఒక బొటన వేలిని కలిగుంటాయి. రెండు, మూడు బొటనవేళ్లని కలిగిన స్లాత్‌లూ అరుదుగా కనిపిస్తాయి.

◆ఇవి చెట్ల కొమ్మల్ని చాలా ధృఢంగా పట్టుకుని ఉంటాయి. కొన్ని స్లాత్‌లు మరణించిన తర్వాత కూడా వాటి దేహాలు చెట్ల కొమ్మలకు వేలాడుతుంటాయట.

◆ఇవి దక్షిణ అమెరికాలోని అతి చిన్న క్షీరదాలు కూడా.

◆నేలపై తిరిగే స్లాత్‌లు మనుగడ సాగించింది క్రీ.పూ. 2700 వరకే. ఇవి ఎక్కువగా క్యూబాలో సంచరించేవి.

◆అడవుల నరికివేతతోపాటు వేటగాళ్ళ బారిన పడి ప్రస్తుతం స్లాత్‌ల మనుగడ ప్రమాదకరంగా మారింది.

కొత్త పుస్తకాలు

జీవన అంతరంగాల వెలుగు కథలు

పుస్తకం :మొపాసా కథా స్రవంతి వెన్నెల వెలుగు
అనువాద రచన : బెందాళం క్రిష్ణారావు
పేజీలు : 192, ధర : 150/-
ప్రతులకు :పల్లవి పబ్లికేషన్స్, అశోక్‌నగర్, విజయవాడ 520010
ఫోన్ నెం. 9866115655, 8522002536



జీవన అంతరంగాలలోని వెలుగులన్నీ తన కథల్లో నింపేశాడు మొపాస. అందుకే ఆ కథలన్నింటిలో జీవన అంతరంగాలే ఆవిష్కరించబడ్డాయి. ఫ్రెంచ్ భాషలో అత్యంత తక్కువ కాలంలో ఎక్కువ రచనలు చేసిన గై డి మొపాసా 1850, ఆగస్టు 5న జన్మించినా, 43 ఏళ్లకే 1893, జులై 6వ తేదీన మరణించారు. ప్రపంచ సాహిత్యంలో కథారచన అనగానే గుర్తుకొచ్చే పేర్లలో మొపాస ఒకరు. వస్తువు, శిల్పము విషయంలో ఓ హెన్రీ, సోమర్ సెట్ మామ్ వంటి వారికీ మార్గదర్శకుడిగా మొపాస పేరుగడించాడు. కథల్లో అసామాన్యమైన సునిశితమైన దృష్టి కోణం కనబరిచినట్లు, మానవ జీవితంలోని అన్ని కోణాలను ప్రధానంగా స్త్రీలోని పార్శ్వాలను ఆయన స్పృశించినట్లు మరెవరూ తడిమి ఉండరు. అదే ఆయన సాహిత్యంలో ప్రధానమైన ఆకర్షణ. మహిళల, సాధారణ పౌరుల జీవితాలనే తన కథావస్తువులుగా తీసుకున్నారు రచయిత. అనువాదం చేసిన రచయిత బెందాళం కృష్ణారావు కూడా వేగంగా రాయగల రచయితే. అయితే, ఈ కథలన్నీ చదవడానికే ఎక్కువ సమయం పట్టిందని ఆయన చెప్పడం వాస్తవం కూడా. తెలుగులోనే మొపాసా ఈ కథను రాశారా అన్నంతగా సహజత్వాన్ని తెచ్చిన అనువాదకుల కృషి అభినందనీయం. మొత్తం పాతిక కథల ఈ కథా సంకలనం ఆసాంతం జీవనకథనాలే. అయితే ఇప్పటికే చాలా మంది మొపాసా కథలను తెలుగులో అనువదించి ఉన్నారు.

టైటిల్ కథ 'వెన్నెల వెలుగు'లో ప్రకృతి రమణీయత, స్త్రీ-పురుష సంబంధాలు సహజ పరిణామాలంటూ ఫాదర్‌కే జ్ఞానబోధ చేశాడు మొపాస. స్త్రీల పట్ల ఉన్న మోహాన్ని, ప్రకృతి సుందర రమణీయతను తన అనుభూతుల్లో నుంచే రాశారనిపిస్తుంది. 'ఇదో చికిత్స' కథలో ఒక వయసు వచ్చిన భార్యాభర్తల మధ్య ఏర్పడిన అనుబంధ అగాధానికి చేసిన చికిత్సే. అయితే అది అంత ఆమోదయోగ్యంగా అనిపించదు. 'ప్రేమపక్షులు' కథలో అవ్యాజమైన ప్రేమ అడవిబాతుల్లో ఎలా ఉందో, అది వాళ్ల చేత వేటను సైతం ఎలా మాన్పించిందో తెలిపే కథ. మనుషుల్లో కన్నా అత్యున్నత ప్రణయానుబంధం వాటిల్లో ఉందంటూ రచయిత ఓ పాఠం నేర్పాడీ కథలో. 'దారపు ముక్క' కథలో నిజాయితీని నమ్మని లోకంలో దాన్ని నిరూపించుకోవడం ఎంత కష్టసాధ్యమో.. లోకం తీరును కళ్లకు కట్టారు రచయిత. అయితే అతని నిజాయితీ లోకానికి ఎంత లోకువో.. నవ్వులాటో.. అద్దంపట్టిన కథ. ఆ వేదనతోనే అతను జబ్బుపడి, అదే కలవరిస్తూ మరణించడం బాధాకరం. లోకం ఈ కథ చదివి కళ్లు తెరవాలన్న రచయిత తాపత్రయం నెరవేరాలని ఆశిద్దాం. నేడూ మనకు అలాంటి సంఘటనలు, వ్యక్తులు తారసపడుతూనే ఉంటారు. అలాగే మిగిలిన కథలన్నీ మన చుట్టూ, మన జీవితాల్లో కనిపించే జీవన దృశ్యాలే. చదివి తీరాల్సిన కథలనిపించాయి. ఏదో ఒక కథలో మన అనుభవం కనిపించి తీరుతుంది. ఇన్ని అనువాదాలైన ఆదరణ లభిస్తుందంటేనే అది మొపాసా కథల వస్తువు, రచనా శైలి గొప్పతనమే.

- శాంతిశ్రీ

వెంగళప్ప : మీ హోటల్లో వేడిగా ఏమున్నాయి?
బేరర్ : చపాతీ ఉంది
వెంగళప్ప : దానికంటే వేడిగా ఏముంది?
బేరర్ : పూరీ
వెంగళప్ప : పూరీ కంటే వేడిగా ఏముంది?
బేరర్ : హో...సూప్ (చిరాగ్గా)
వెంగళప్ప : దానికంటే వేడిగా?
బేరర్ : పొయ్యిపై మంట (కోపంగా)
వెంగళప్ప : వెరీగుడ్.. అదే తీసుకురా

రాము : నాకే గనుక బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి వస్తే కచ్చితంగా నీ బ్రెయినే కొంటా...
సోము : నా...బ్రెయినా! ఎందుకు?
రాము : నువ్వు నీ బుర్రని ఇప్పటివరకూ ఉపయోగించలేదుగా...ఫ్రెష్‌గా ఉంటుందని.

తల్లి : ఏరా, చెల్లిని అన్ని మెట్లమీద నుంచి తోసేశావా?
బన్ని : లేదమ్మా, నేను ఒక్క మెట్టే తోశాను. మిగతావాటి మీంచీ అదే పడిపోయింది.

నవ్వుల్-పువ్వుల్

ప్యూన్ : ఏమయ్యా మ్యానేజర్ రూమ్ బయట నో యంట్రీ బోర్డు చూసి కూడా అలా లోపలికి దూసుకెళ్ళిపోతున్నావేంటి?
వెంగళప్ప : అదే.. లోపలికెళ్ళి పర్మిషన్ తీసుకొద్దామని.

రమేష్ : ఏంటోనండీ ప్రపంచంలో అందరూ నన్ను ద్వేషిస్తున్నారనిపిస్తోంది. ఒక్కళ్లు కూడా నాతో స్నేహంగా ఉండరు. ఎవరికీ నేనంటే ఇష్టం లేదు.
హిప్నాటిస్ట్ : అలా ఎందుకనుకుంటారండీ నేనున్నానుగా, మీరంటే నాకెంతో గౌరవం, ఎంతో ఇష్టం కూడానూ..
రమేష్ : ఆ విషయం నాకు తెలుసనుకోండి, కానీ నేను ఎన్నిసార్లు మీ చుట్టూ తిరిగి డబ్బివ్వగలను చెప్పండి?

నా ప్రపంచంలో నేను

ప్రతి పిల్లవాడి
గుండెకు ఎటువంటి మలినం
అంటుకోని దశలో
వాడి గుండె చప్పుడు ఇది

'అడవిలో అక్షరాన్నై
తుపాకీ తూటాలని వెదజల్లుతా
నిప్పుల కొలిమిలోంచి
కొడవళ్లను తీసి
ఆకురాయితో పదునుపెడతా

అవినీతి గుండెల్లో
మందుపాతరలు పేలుస్తా
ఇసుక దిబ్బల్లో మాఫియాను సమాధి చేస్తా

మతోన్మాదంపై కలం ఎక్కుపెడతా
విప్లవమై వెలివాడలను అక్షర
వెలుగునిస్తా.....
బంజరు భూమికి
ఆకుపచ్చ బంగారం అద్దుతా....

మానవత్వపు మొక్కల్ని నాటుతా
ప్రేమాను బంధాలను పూస్తా...
మనుషుల మధ్య దూరాన్ని చెరిపేస్తా
మమతల రహదారులు వేస్తా

కష్టజీవుల కళ్లలో జీవం పోస్తా....
శ్రమజీవుల చెమటచుక్కలను ఒడిసి పడతా.....
మండేఆకలిని తీరుస్తా.....
వాళ్ల ఆశలకు ఆయువు పట్టునవుతా..
పేదవాని కన్నీటికి ఆనకట్టను నేనౌతా..' అని

- హరి అంబటి
9652923272



చిగురించిన శిల

కఠినాత్మలను చూసి
శిలా హృదయాలని
మాతో పోలుస్తారు
వాస్తవంలో శిలలమే కానీ
అంతరంగంలో శిరీష హృదయాలం
మార్పు రాని బండలు
ఎద్దు మొద్దు స్వరూపాలు
శుద్ధ జడ స్వరూపాలు అని
గుండె గాయాలు చేయవద్దు
కడలి తరంగాలకే
తరిగిపోయే మృదు మనస్కులం
ఎన్ని రోజులు యుగాలైనా
ఎంత సుదీర్ఘ కాలమైనా
మారని రాళ్లు అని నిందించకండి
ప్రాణవాయువులను పంచిపెడుతూ
పత్రహరిత అమృతాన్ని అందించే
చిన్నారి మొక్కలను
చిగురింప జేసే సంజీవనిని
శిల్పి చేతిలోని ఉలి తాకిడికే
ప్రాణశక్తి నిదురలేచి
తీగలై పూవులై
పల్లవించి
రమ్యమైన శిల్పాలుగా
కళాకారుల హృదయాలలో
చెక్కు చెదరని చిరునామాని

- పెరుమాళ్ళ రవికుమార్
9492401974

వెన్నెల్లో ఆడపిల్లనే...



ఆసక్తి లేని రక్తిని... శక్తి కోల్పోయే వరకు పంచి
కడుపు సంచిని నింపిన వేశ్య తల్లిని అయితే ఏంటి..?
బిడ్డ పేగుకు అతికే మెతుకులకు తెలియదు కదా..!
కర్మ కాలి దిగజారిన వృత్తి కాదు నాది
కడుపు మండి బతుకు కాలిన వాసన భరించలేక
దిగి, జారిన వృత్తి... నాది
పొట్ట కూటికి ఊరు వదిలి దూరంగా వెళితే
అనుభవం లేదు కదా అని
అనుభవిస్తామన్న వాళ్ల లెక్క మర్చిపోలేను
నాలుగు గోడల మధ్య నలపబడిన
నా దేహం చూసి వేశ్య అని ముద్ర వేశారే...
నాలుగు గదుల అంతర్భాగంలో ఉడికి
సంకోచ వ్యాకోచాల మధ్య ద్రవించి
అర్థరహితంగా ఆవిరైపోయిన నా కన్నీళ్లు
చూడలేదుగా?
పదిమందికి నా దేహాన్ని అమ్మితే నన్ను వేశ్య అంటే
నా దేహాన్ని దాహంతో కొన్నుక్కున్న పదిమంది
ఏమవుతారు?
వేడి జ్వరంతో చలికి వణుకుతున్నా
కామాంధుల వేడిని చల్లార్చే
నా చెమట నీరు సుగంధ ద్రవ్యమట మత్తుగాళ్లకి..!
గుండెల నిండా భారం ఉన్నా
దాహం వేసిన దేహానికి దప్పిక తీర్చే,
తన్మయత్వం తెలీని నా తనువు
ఊపిరి ఆగిపోయాక
మట్టిలో కలిసేదే కదా..!
వెలివేసిన సమాజంలో
నావీ కొన్ని విలువైన క్షణాలు ఉన్నాయి
అమ్మ పాల రుచి, కన్నపేగు తీపి
కలగలసిన మాతృత్వపు గురుతులూ ఉన్నాయి
నేనూ స్త్రీ....నే!
చీకటిలో మెరిసే నా బతుకు రంగు ధర తక్కువే..
కానీ, నేనూ వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లనే

-రాజశేఖర్ సముద్రాల
rajasekharsamudrala
@gmail.com

త ద వి కా స ం 126

కూర్పు : రావెళ్ల

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12		✿	✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

ఆధారాలు

అడ్డం

1. తోలుసంచి (4)
3. ఒకరకపు అద్దకం (4)
7. కొర్రు (2)
8. చినిగిన బట్ట ముక్క (3)
9. చావో రేవోలో రేవు ఎండిపోయింది (2)
12. నైపుణ్యంలో ఉన్న (3)
13. తెగడంతో అయ్యే ధ్వనిని సూచించే శబ్దం (3)
17. కుడినుండి కొంచెం (2)
18. వాదులాడు (3)
19. అభివ్యక్తిలో వ్యక్తి పోయాడు (2)
22. ఆశ్రమపాఠశాల (4)
23. తోడల్లుడు (4)

నిలువు

1. చెవిపోటు (4)
2. దిబ్బ (2)
4. కుటుంబం (2)
5. వ్యర్థమగు (4)
6. మొగ్గ... 'కలి'తో మొదలు (3)
10. కొత్తదైన (3)
11. చిటుక్కున చేయులోని తొలిసగం (3)
14. సమానమగు (4)
15. తిట్టు (3)
16. సభలో పాల్గొనేవాడు (4)
20. నెపం (2)
21. కీడు (2)

అ ఆ ఇ ఈ

6				3				
4		3	8		5			
	2	8	7					
8					4	3	6	
				2				
	3	4	6					1
					3	6	5	
			5		8	7		2
				1				9

గతవారం జవాబులు

7	6	5	8	4	3	2	1	9
4	1	2	6	9	7	8	5	3
9	3	8	2	5	1	7	6	4
3	2	4	1	8	6	5	9	7
1	8	9	5	7	4	6	3	2
6	5	7	9	3	2	4	8	1
8	7	1	4	6	9	3	2	5
5	9	3	7	2	8	1	4	6
2	4	6	3	1	5	9	7	8

1 పా	లి	2 కే	క	✿	3 మ	4 ణి	మా	5 ల
ల	✿	శం	✿	6 మ	✿	ఫ	✿	య
7 మా	య	✿	8 న	ర్మ	ద	✿	9 టీ	కా
రు	✿	10 జై	✿	ము	✿	11 చె	✿	లం
✿	12 గు	ఋ	లు	✿	13 పు	క్కి	లి	✿
14 త	✿	లు	✿	15 నా	✿	లి	✿	16 ల
17 రు	తా	✿	18 వ	గ	పు	✿	19 కో	వా
రా	✿	20 తా	✿	రం	✿	21 గా	✿	ణ
22 జం	21 గు	పి	ల్లి	✿	23 ప్రా	మా	ణి	కం

ఎగ్ పరాటా

రుచి

కావల్సినవి :

గోదుమపిండి : 2 కప్పులు, గుడ్లు : 4, నూనె : 1 స్పూను, నెయ్యి : వేయించడానికి సరిపడా, ఉప్పు : రుచికి సరిపడా

తయారీ :

ముందుగా గోధుంపిండిలోని కొన్ని నీళ్ళు పోసి కలిపి పెట్టుకోవాలి. పిండి కలుపుకున్న తర్వాత, దానికి పల్చని తడిగా ఉండే క్లాత్‌ను కప్పి అరగంట పక్కన పెట్టుకోవాలి. అంతలోపు, ఆ పిండి నుండి కొద్దిగా (బాల్ సైజ్)పిండిని తీసుకొని చపాతీలా రోల్ చేసుకోవాలి. ఇలా వత్తుకొన్న చపాతీ మీద కొద్దిగా నూనె చిలకరించి చపాతీ మొత్తం అర్ధ వృత్తాకారంలో రోల్ ఫోల్డ్ చేసుకోవాలి. తిరిగి మరికొద్దిగా నూనె వేసి వేడి చేసి, చపాతీని పాన్ మీద వేసి రెండు వైపులా కాల్చుకోవాలి. కాలేటప్పుడు , చపాతీపైపొరలాగా తీసి నిదానంగా దాని మీద గుడ్డు పగులగొట్టి పోయాలి. ఇప్పుడు మరికొద్దిగా నూనెను చిలకరించి బంగారు రంగు వచ్చే వరకూ రెండు వైపులా కాల్చుకోవాలి. తయారుచేసుకోవాలి. అంతే ఎగ్ పరోటా రిసిపి రెడీ...

చనా పరాటా

కావలసినవి :

గోధుమ పిండి- ఒకటిన్నర కప్పు, నూనె- 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడా, నానబెట్టిన తెల్ల శెనగలు- 1 కప్పు, ఉల్లిపాయ ముక్కలు- 1/2 కప్పు, పచ్చిమిర్చి- 4, అల్లం తరుగు- 1/4 టీ స్పూను, కొత్తిమీర, కరివేపాకు తరుగు- ఒక్కోటి 1/2 టీ స్పూను చొప్పున, కారం- 1/2 టీ స్పూను, గరంమసాల- 1/2 టీ స్పూను, పసుపు- చిటికెడు.

తయారీ :

గోధుమ పిండిలో ఉప్పు, రెండు టీ స్పూన్ల నూనె వేసి, సరిపడా నీళ్ళతో చపాతీ పిండి కలుపుకోవాలి. దానికి నూనె పట్టించి ఒక గంట సేపు నాననివ్వాలి. తరువాత శెనగలు, పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, అల్లం తరుగు మిక్సీలో వేసి కొద్దిగా నీళ్ళు చిలకరించి బరకగా ముద్ద చేయాలి. తరువాత ఒక కడాయిలో టేబుల్ స్పూను నూనె వేసి ఉల్లిపాయ ముక్కలను దోరగా వేగించుకోవాలి. ఆ తరువాత శెనగల ముద్ద వేసి పచ్చివాసన పోయేవరకూ వేగించి, కారం, పసుపు, గరం మసాల జల్లి మరో రెండు నిమిషాలు వేగించి దించేయాలి. తరువాత నిమ్మకాయ పరిమాణంలో చపాతీ పిండి తీసుకుని, దాని మధ్యలో కొద్దిగా శెనగల మిశ్రమాన్ని పెట్టి మూసేసి, చపాతీలు ఒత్తుకోవాలి. ఈ చపాతీలను రెండు వైపులా నూనె వేస్తూ దోరగా వేగించుకోవాలి.

మేతీ మిస్సి పరాటా

కావల్సినవి :

మెంతి ఆకులు : 1కప్పు, గోధుమపిండి : 2 కప్పులు, శెనగపిండి : 1 కప్పు, పచ్చిమిర్చి : 1 (సన్నగా తరగాలి), ఉల్లిపాయ : 1 (సన్నగా తరగాలి), కారం : 1 స్పూను, ఉప్పు : రుచికి సరిపడా, నీళ్ళు : 1 కప్పు, నూనె లేదా నెయ్యి : 3 స్పూన్లు

తయారీ :

ముందుగా ఒక బౌల్ తీసుకొని అందులో గోధుమ పిండి, శెనగపిండి, ఉప్పు, మెంతి ఆకులు, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, కారం , ఎండుమిర్చి పౌడర్ మరియు ఒక చెంచా నూనె వేసి, సరిపడా నీళ్ళు పోసి బాగా మెత్తగా చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని పది నిముషాలు పక్కన పెట్టుకొని తర్వాత కొద్ది..కొద్దిగా చేతిలోనికి తీసుకొని మీడియం సైజ్ బాల్స్‌లా చేసుకోవాలి. ఇప్పుడు ఈ బాల్స్‌ను చపాతీ కర్రతో చపాతీల్లా వత్తాలి. స్టౌ మీద వేడెక్కిన తర్వాత నూనె లేదా నెయ్యి రాసి చపాతీలను ఒక్కోదాన్ని వేసి రెండు వైపులా బాగా కాల్చుకోవాలి. ఇలా అన్ని రోటీలు తయారు చేసుకున్న తర్వాత వేడి వేడిగా కర్రీ లేదా పెరుగుతో సర్వ్ చేయాలి అంతే మేతి మిస్సీ రోటి రెడీ..

సంగీత గలగలలు

బొమ్మల కథ

అమ్మకోసం

'జాబూ' యానిమేషన్ షార్ట్‌ఫిల్మ్... ఓ సెక్స్‌వర్కర్ ఐదేళ్ల బిడ్డ ... తన తల్లి కోసం పడే ఆరాటమే కథ. ప్రతి రాత్రి అమ్మ ఎక్కడకు వెళుతుందో తెలీని చిన్నారి ఆమెను వెతుక్కుంటూ ఇంటి బయటకు రావడం... మృగం ముసుగు వేసుకున్న వ్యక్తి చేతబడటం... మరో ఇంట్లోని తనలాంటి చిన్నారికి తల్లితోపాటు తండ్రి ఉండటం గమనించడం... తనకున్న జీవితాన్నే వెలుగులమయంగా ఊహించుకోవడం... తల్లి కోసం ఎదురుచూస్తూ చూస్తూ నిద్రలోకి జాబూ జారుకోవడం... ఇలాంటివన్నీ మన కంటతడిపెట్టించే దృశ్యాలు. ఓ చేదు వాస్తవంతో ముగిసే ఈ లఘుచిత్రం వేశ్య కుటుంబ దుస్థితిని మరో కోణంలో చూపిస్తుంది. నదియా డేరీస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఎన్నో ప్రఖ్యాత అవార్డులు కూడా దక్కాయి. చిత్ర నిడివి ఐదు నిమిషాలు.

ట్యూబ్‌లైట్

'ఓ మనిషి'... తెలుగు లఘుచిత్రం.... ఓ విషయాన్ని చాలా బలంగా, మానవీయంగా చెప్పడంలోనే ఈ చిత్రం విలువ పెరిగింది. ఆత్మహత్యల మీద వచ్చిన కథాంశం మనల్ని కదిల్చేస్తుంది. పంట కోల్పోయిన ఓ రైతన్న, ప్రేమ విఫలమైన ఓ కుర్రాడు, మెడిసిన్ సీట్ దక్కించుకోలేని ఓ విద్యార్థిని.. ఇలా ఈ ముగ్గురి చుట్టూ కథ నడుస్తుంది. సాధారణంగా నాలుగైదు ఎమోషనల్ డైలాగులతో కాక నేపథ్యాన్ని, ఊగిసలాటను, పరిస్థితిని... కళ్లకే కాదు హృదయానికి తాకేలా తెరకెక్కించడమే ఈ చిత్రం గొప్పదనం. 44 నిమిషాల నిడివి ఉన్న ఈ లఘుచిత్రాన్ని ఎక్కడా

ధైర్యాన్నీ పోనీకన్నా..!

మిస్సవక్కుండా చూసేలా కథనం లీనం చేస్తుంది. శ్రీనివాస్ ఆరుమిల్లి దర్శకత్వం, సలీమ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, రాహుల్ తల్లా ఎడిటింగ్, కార్తీక్ కొడకండ్ల సంగీతం... ఇవన్నీ చిత్రానికి బలాన్నిచ్చాయి. ఇక నటులందరికీ మంచి మార్కులు వేయాల్సిందే. హృద్యంగా సాగే సన్నివేశాలప్పుడు అదంతా నిజమనే భావనకు వాళ్లు లోనుచేస్తారు. వీరి నటనకు తగ్గట్టు సంభాషణలూ సాగుతాయి. 'మట్టెప్పుడూ మోసం చేయదయ్యా.. మనుషులే చేస్తారు...' 'పంట పోతే పోయింది... ధైర్యం పోనీకన్నా...' ' చావడానికి కాదు బ్రతకడానికి కారణాలు వెదుక్కో...!' 'లైఫ్‌లో ఎన్నో ఆప్షన్లున్నాయి నాన్నా..!' ఇలా కొన్ని డైలాగులు ఆలోచనలో పడేస్తాయి.

అమ్యూజిక్

జూ'పెర్క్యూషన్ సౌండ్‌స్కేప్- విండ్, రైన్, బర్డ్స్ అండ్ మోర్'.... వర్షం చప్పుడు మనసుకు హాయినిస్తుంది. అందుకే మానసిక ప్రశాంతత కోసం వర్షపు సంగీతం పుట్టుకొచ్చింది. యూట్యూబ్‌లో కావాల్సినంత ఆ సంగీత జల్లుల్ని వినొచ్చు. అయితే, ఈ సంగీతాన్ని కృత్రిమంగా సృజిస్తారనే విషయం తెలుసా..! వాటికంటూ ప్రత్యేకమైన వాద్యపరికరాలు కూడా ఉన్నాయి. మెక్సికన్ల వాద్యాలతో బూరలతో నీటిగలగలల్ని, హోరుగాలిని సృష్టిస్తారు. ఇదెలాగో తెలియాలంటే పెర్క్యూషన్ సౌండ్‌స్కేప్ వీడియో చూడాలి. గాలి, వర్షమే కాదు పిట్టల అరుపుల్ని కూడా సంగీత పరికరాలతోనే చేయడం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. సంగీతకారుడు కలాని ఆ వివరాలన్నింటినీ ఈ వీడియోలో పంచుకుంటాడు. చూసి ఆశ్చర్యపోండే..! విని పరవశించండే..!

సుచిత్రం

ప్రకృతిలో మమేకమై..

ఊసరవెల్లి ఎంత అద్భుతం.. చుట్టూ ఉన్న పరిసరాల రంగుల్లోకి మారిపోయి కలిసిపోతుంది. మనిషికిది సాధ్యమా..? కదలకుండా అలా నిలబడగలమంటే.. ప్రకృతిలో మమేకం చేసి చూపిస్తానంటోంది విలిజా విట్కుటె. స్వీడన్/లిథువేనియాలకు చెందిన 26 ఏళ్ల ఈ బాడీ పెయింటర్ ఆర్ట్స్, స్కాండినేవియా ప్రకృతి అందాల్ని మనిషిలోనూ చిత్రిస్తోంది. 'ది ల్యాండ్‌స్కేప్స్ వితిన్' అనే టైటిల్‌తో బాడీ పెయింటింగ్ సిరీస్‌ను రూపొందించింది. మనిషి వేరు, ప్రకృతి వేరు.. అనే మాట తప్పనే విలిజా.. ప్రకృతిలోనే మనం.. మనలోనే ప్రకృతి ఉందని చెబుతోంది.



రైతు మిత్రులకు మరియు మా శ్రేయోభిలాషులకు దసరా

శుభాకాంక్షలు

ఈ దసరా పండుగ సందర్భమున రైతులందరు
అధిక దిగుబడులు పొంది సుఖ సంతోషాలతో
తులతూగాలని ఆశించుదాం. ఇదంతా కేవలము
జైన్ డ్రిప్ ద్వారానే సాధ్యమవుతుంది.

చిన్న ఆలోచనలూ విప్లవాత్మక సత్ఫలితాలు

Website : www.jains.com

Toll Free : 18005997899

జైన్ పైపులు ™ | జైన్ డ్రిప్ | జైన్ పిఇ పైపు | జైన్ స్ప్రింక్లర్స్ | జైన్ గ్రీన్ హావుస్ | జైన్ టిష్యూకల్చర్ | జైన్ జీవన్ సోలార్ పంప్

జైన్ ®
జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

గుంటూరు అడ్రసు : ప్లాట్ నెం.302, నివాస్ ఎన్‌క్లేవ్, శ్రీరాంనగర్, 11వ వీధి, ఆర్.టి.ఓ ఆఫీస్ రోడ్ దగ్గర, గుంటూరు - 522034.
ఆంధ్రా ఫోన్ నెంబర్లు : 9440797807, 94407 97880, 94407 97840
హైదరాబాద్ అడ్రసు : 1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్- 500 080
తెలంగాణ ఫోన్ నెంబర్లు : 9440797846, 9440797824, 9440797825







రాతి అడవి



భూమ్మీది వింత ప్రదేశాల్లో మడగాస్కర్‌లోని గ్రాండ్ సింగీ ఒకటి. స్థానిక మలగాసీ భాషలో సింగీ అంటే 'ఉత్తకాళ్లతో నడవలేని చోటు' అనే అర్థం వస్తుంది. ఈ ప్రాంతాన్ని చూశారు కదా..! బూట్లు వేసుకుని కూడా నడవడం కష్టసాధ్యమే అనిపిస్తోంది. ఒక్క అడుగు తేడా పడినా ప్రాణం మీదకు వస్తుంది. సుమారు 3,75,600 ఎకరాల్లో విస్తరించిన ఈ సున్నపు రాతి ప్రాంతాన్ని భూమ్మీది అతిపెద్ద రాతి అడవిగా పిలుస్తారు. ఒక్కో రాతి ప్రదేశం 2600 ఎత్తుకు కూడా ఉంటుంది. 20 కోట్ల ఏళ్ల క్రితం భూఫలకాల రాపిడి వల్ల పైకి తన్నుకొచ్చిన కాల్సైట్.. ఆ తర్వాత కోట్ల ఏళ్లపాటు వర్షపాతాల ధాటికి కోసుకుపోయిన రాతి నిక్షేపాలు ఈ ఆకృతిని సంతరించుకున్నాయి. భూగర్భజలాల వల్ల ఈ రాతి ప్రదేశాల కింద భారీ సొరంగాలు, గుహలు ఏర్పడ్డాయి. మిగతా ప్రాంతానికి విభిన్నంగా ఉన్న పరిస్థితుల వల్ల ఇక్కడి జీవజాలం కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడే లెమూర్‌ల్ని చూడొచ్చు. కోట్ల ఏళ్ల క్రితం మడగాస్కర్, ఇండియా అతుక్కుని ఉండేవని ఆ తర్వాత భూఫలకాల గమనం వల్ల దూరమయ్యాయని పరిశోధకులు తేల్చింది లెమూర్‌ల వల్లే..! ఈ రెండు చోట్లే అవి మనుగడలో ఉన్నాయి మరి.